ఉష్ణోగ్రత (అంచనా)

26-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	40	24
బాపట్ల	36	27
రెంటచింతల	41	26

ఉపాధి పనిదినాల్లో.. భారీగా కోత!

- తగ్గిన 12.70 లక్షల పనిదినాలు
- అమలు కాని రూ.307 కనీస వేతనం
- జిల్లాలో సగటు వేతనం రూ.282 మాత్రమే

ఆర్థిక సంవత్సరం	పనిదినాలు
2022-23	94,05,074
2023-24	84,76,071
2024-25	87,48,695
2025-26	74,77,946



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 5.88 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. 4.29 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.307గా వేతనం ప్రకటించింది. ఈ మేరకు వేతనం కార్మికులకు అందడం లేదు. ఈ నెలలో ఇప్పటి వరకు చెల్లించిన సగటు వేతనం రూ.282గా ఉంది. గతేడాది రూ.300 ప్రకటించగా రూ.222 నుంచి రూ.279 వరకు మాత్రమే చెల్లించారు. ప్రభుత్వం సూచించిన విధంగా కార్మికులకు వేతనం చెల్లించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు గుర్తించి వాటికి అంచనా వ్యయం రూపొందించే సమయంలోనే నిర్దేశించిన వేతనం కార్మికునికి చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జరుగుతున్న లోపాల వల్ల కార్మికులు కనీస వేతనం అందక నష్టపోతున్నారు. ఉపాధి హామీ పని దినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధిస్తోంది. 12.70 లక్షల పనిదినాలు తగ్గించడంతో వంద రోజుల పని గ్యారెంటీకి విఘాతం కలిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఇంత తక్కువగా పనిదినాలను తగ్గించడం ఇదే ప్రథమం. ఇది ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా ఉందని గ్రామీణాభివృద్ధి కార్మికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత ఊరిని వదిలి.. పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. సొంత ఊరిలోనే పనులు కల్పించి, ఉపాధి కల్పిస్తోంది. ఇలాంటి ఉన్నతమైన పథకం ద్వారా ప్రతి ఏటా పనిదినాలు పెంచాల్సింది పోయి.. ఈ ఏడాది భారీగా ప్రభుత్వం కోత విధించింది. గత ఆర్థిక సంవ త్సరంతో పోలిస్తే ఈ ఏడాది 12.70 లక్షల పనిదినాల కోత పడిం ది. దీని వల్ల పెద్ద ఎత్తున జిల్లాలో కార్మికులు ఉపాధిని కోల్పో నున్నారు. కనీస వేతనం రూ.307గా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అంటే దాదాపు రూ.39.01 కోట్లు కార్మికులు కోల్పోనున్నారు. ఉపాధి పనిదినాల కేటాయింపులు పెంచాలని వారు కోరుతున్నారు.

లక్ష్యానికి దూరంగా పనులు

ఈ నెలలో 7,71,052 పని దినాలు లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,98,284 పని దినాలను కల్పించారు. 38.68 శాతం కూడా పనిదినాలు పూర్తి కాలేదు. ఇంకా ఐదు రోజుల్లో లక్ష్యం మేర పనిదినాలు కల్పించే పరిస్థితులు లేవనే చెప్పాలి. కార్మికులకు పనులు కల్పించడంలో ఉపాధి శాఖ క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల వ్యయం అంచనా రూపొం దించే సమయంలో ప్రతి కార్మికునికి రూ.307 వేతనం అందేలా ప్రణాళిక ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం కార్మికునికి వేతనం రూ.282 చెల్లించడమే. అందరికి ప్రభుత్వం ప్రకటించిన వేతనం చెల్లించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి

- స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా 15 శాతం వృద్ధే ధ్యేయం
- అన్ని రంగాల వివరాలు సేకరించి కార్యచరణ సిద్ధం చేయాలి
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికలను నిర్దేశిత లక్ష్యాలు, మార్గదర్శకాలు ప్రకారం సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో విజన్ యాక్షన్ ప్రణాళికపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ఉద్యోగులకు(సీవీఏపీఎస్) శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. దీనికి అనుగుణం గా నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వ యం చేసుకుంటూ వీఏపీలను రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక వృద్ధి సాధించేందుకు అవకాశం ఉన్న రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధికి అవకాశం ఉన్న రం గాల్లో నూతన ప్రాజెక్టులు ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్‌తో పాటు సక్రమంగా అవి అమలయ్యేందుకు ఉన్న అవకాశా లను కూడా తెలియజేయాలన్నారు. వీఏపీని రూపకల్పనపై ప్రణాళిక విభాగం డైరెక్టర్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతి పాల్గొన్నారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిరీక్షణకు తెర



- స్పౌజ్ కోటా పింఛన్లకు ఆమోదం
- మూడు జిల్లాల్లో 10 వేల మందికి ఛాన్స్
- 2023-2024 మధ్య మృతుల కుటుంబాలకు అవకాశం
- 30వ తేదీ లోగా దరఖాస్తు.. మే నెల నుంచి పింఛన్
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో హర్షం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్త పింఛన్ల మంజూరు విషయంలో తొలి విడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఈ విధానం కొనసాగుతున్నా అది 2024 అక్టోబరు తర్వాత చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తోంది. అంతకు ముందు చనిపోయిన వారికి వర్తించడం లేదు. ప్రభుత్వం తాజాగా అలాంటి వారికి కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. తాజాగా అవకాశం కల్పించిన స్పౌజ్ కోటా పింఛన్ల దరఖాస్తులకు ప్రభుత్వం లిమిటేషన్ విధించింది. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయిన పింఛనుదారు కుటుంబీకులకు మాత్రమే ప్రస్తుతం స్పౌజ్ కోటాలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10 వేల మంది పింఛన్లకు అర్హులవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం నిర్ణీత కాలంలో చనిపోయిన వారికే దరఖాస్తు అవకాశాన్ని కల్పించడంపై అర్హులై ఉండి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పెదవి విరుస్తున్నారు. 2023 డిసెంబరుకు ముందు చనిపోయినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనల పేరిట గతంలో వడపోత..

గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనల పేరుతో వడపోత పోసి వేలాది మందిని అనర్హులుగా ప్రకటించింది. ఇంటిస్థలం ఎక్కువ ఉందని, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, ఇన్‌కమ్‌టాక్స్ చెల్లించారని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడని, సవాలక్ష కారణాలు చూసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు విడతలుగా 65 వేల మందిని అనర్హులుగా ప్రకటించి వారికి పింఛను ఎగ్గొట్టింది. ఈ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తూ అనేక మందికి పింఛను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో పింఛనుదారు మరణిస్తే దాన్ని కుటుంబ సభ్యులకు వర్తింపజేయలేదు. దీంతో వారు కూడా పింఛన్ల కోసం నిరీక్షించేవారి జాబితాలోనే ఉన్నారు. ఇప్పుడు వారంతా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఆచి తూచి స్పందిస్తోంది. ప్రస్తుతం ఉన్న అనర్హులను ఏరివేస్తూ, వారి స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పిస్తోంది. ఆ క్రమంలో తొలివిడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా..

స్పౌజ్ కోటాలో పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. భార్యా భర్త ఇద్దరూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఉండాలి. ఒకే రేషన్ కార్డులో పేర్లు ఉండాలి. భర్త చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డు కూడా తీసుకుని సచివాలయానికి వెళితే డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేస్తారు. స్పౌజ్ కేటగిరిలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేవారు అర్హులైనప్పటికీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే ఇంట్లో లేకుండా ఉంటే వారు ఈ కోటా కింద అనర్హులు అవుతారు. వారు జనరల్ కోటాలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మోదీకి మహిళలతో స్వాగతం

- సుమారు కిలోమీటర్ పొడవునా రోడ్డు షో
- రూట్‌మ్యాప్‌ని పరిశీలించిన కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃశంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొనేందుకు శుక్రవారం (మే 2) రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహి ళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకనున్నారు. ప్రధాని హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యే హెలిప్యాడ్ వద్ద నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా సీఎం చంద్రబాబుతో కలిసి మోదీ రోడ్డు షోలో పాల్గొన నున్నారు. ఇందుకోసం ఇన్‌చార్జి బాధ్యతలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డికి ప్రభుత్వం కేటాయించింది. దీంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన రోడ్డు షో ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు షో రూట్ మ్యాప్‌ని పరిశీలించి ఆ మార్గానికి ఇరు వైపులా మహిళలను ఏ విధంగా తీసుకురా వాలనే దానిపై సమీక్షించారు. కిలోమీటర్ పొడవునా మహిళలు ప్రధానికి చేతులు ఊపుతూ... స్వాగతిస్తూ ప్లకార్డులు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మహిళలను సమీక రించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ఆహార సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. అలానే ఎక్కడికక్కడ రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సీఈవో సతీష్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరి మల్లికార్జున, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఎస్పీ సతీష్‌కు మార్, జేసీ భార్గవతేజ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ పాల్గొనే రోడ్డు షో రూట్‌మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గ్రామానికో.. మోడల్ పాఠశాల

- తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి
- ప్రాథమిక విద్య పటిష్ఠతకు ప్రభుత్వం కసరత్తు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిన ప్రాథమిక విద్యా రంగాన్ని పటిష్ఠ పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. మోడల్ పాఠశాలల ద్వారా ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేసేలా కార్యచరణ రూపొందించింది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బడులను చక్కదిద్దేలా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. తక్కువ మంది విద్యార్థులు, ఎక్కువ పాఠశాలలు, తక్కువ మంది ఉపాధ్యాయుల కారణంగా ప్రాథమిక విద్య నానాటికి దిగజారిపోతుంది. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వం టి ప్రాథమిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల్లో లేదని పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రాథమిక విద్య పునా ది సరిగా లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చదువును అందుకోలేకపోతున్నా రని ఆయా సర్వేల్లో తేలింది. ఈ పరిస్థితులను మార్చి ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టు కానున్నాయి. ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 120 లేదా 90 మంది విద్యార్థులు ఉంటేనే ఐదుగురు ఉపాధ్యాయులను నియమిం చేవారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఎంపిక చేసి ఒక్కో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టి న జీవో 177 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తిరిగి ఆయా మోడల్ పాఠశాలల్లో చేర్చా లని ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఫలితాలలో మె రుగు అవుతాయని ఆశిస్తోంది.



మోడల్ కానున్న రామలింగేశ్వరపేట ప్రాథమిక పాఠశాల

అధికారుల్లో ప్రణాళిక లోపం...

ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా విద్యాశాఖ అధికారుల్లో ప్రణాళికా లోపం కనిపిస్తోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడంలో అధికారుల్లో సరైన ప్రణాళిక లేకుండా పోయింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లి దండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలను నిర్ణయించాలి. కానీ వసతు లు పేరిట దూరంగా ఉండే పాఠశాలలను ఎంపిక చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలో వసతులు లేవనే సాకుతో వాటిని ఎంపిక చేయడంలేదంటున్నారు. దగ్గర్లో ఉన్న బడిని వదిలి దూరంగా ఉండే పాఠశాలను ఏర్పాటు చేస్తే తమ పిల్లలు వెళ్లలేరంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఆశిం చిన లక్ష్యం నెరవేరకుండా పోయేలా ఉంద ని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికీ ఏ గ్రామంలో, ఏ పట్టణంలో ఎన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టైన విషయాన్ని కూడా అధికారులు ఇంత వరకు తేల్చలేదు.

నేడే మత్స్యకారులకు చేయూత

- రూ.10 వేల నుంచి 20 వేలకు పెరిగిన పరిహారం
- 12,671 మంది గంగపుత్రుల ఖాతాల్లో రూ.25 కోట్లు జమ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వేట నిషేధ భృతిని పంపిణీ చేసేందుకు మత్స్యకారులకు చేయూత కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఈ కార్య క్ర మానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇక బాపట్ల జిల్లా విషయానికి వస్తే నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో మత్స్యకారుల చేయూతను మంత్రి అనగాని సత్యప్రసాద్ పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వేట నిషేధ భృతిని రూ.10,000 నుంచి రూ.20,000 పెంచి మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం నుంచి ఈ నిధులు గంగపుత్రుల ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 12,671 మంది మత్స్యకారులకు పరి హారం అందనుంది. మొత్తం రూ.25 కోట్లు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. క్షేత్రస్థాయిలో దాదాపు వారం రోజులు సమగ్ర సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా జరిపినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపారు. జిల్లాలోని మత్స్యకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టరేట్ వేదికగా రెట్టింపు పరిహా రం ఆనందాన్ని జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని శుక్రవారం ఓ ప్రకటనలో మత్స్యశాఖ తెలిపింది.



మిర్చియార్డుకు వేసవి సెలవులు

● 9వ తేదీ వరకే కొనసాగనున్న ట్రేడింగ్



గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు రానున్నాయి. ఏటా మే నెల మొదటి వారం తర్వాత యార్డులో పని చేసే పరిస్థితులుండవు. ఒకపక్క ఎండ తీవ్రత, మరోవైపు మిర్చికోరుతో వ్యాపారస్థులు, ఉద్యోగులు, ముఠా కార్మికులు అనారోగ్యం భారిన పడుతుంటారు. దీనిని పరిగణనలోకి తీసుకొని మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారస్థులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటిస్తారు. ఆ విధంగా మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించాల్సిందిగా ఆయా సంఘాలు జీఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకి విజ్ఞప్తి చేశాయి. దీనిపై మార్కెటింగ్ శాఖ లాంఛనంగా ఆమోద ముద్ర వేస్తుంది. కాగా మే 9వ తేదీ శుక్రవారం వరకే యార్డులో ట్రేడింగ్ జరుగుతుంది. 10, 11 తేదీలు శని, ఆదివారంలు యార్డుకు సాధారణ సెలవుదినాలు, తిరిగి జూన్ 8వ తేదీన యార్డులో మిర్చి లావాదేవీలు పునఃప్రారంభమౌతాయి.

ప్రమాదవశాత్తు గుండ్లకమ్మలో పడి బాలిక మృతి

నూజెండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ నదిలో పడి బా లిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు సమీపంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చీకటి విజయ రాజు కృపావరంల కుమార్తె చీకటి కీర్తి హెలోనిక(11) మధ్యాహ్నం సమయంలో ఇంట్లో వాడుకొనేం దుకు నీటి కోసం సమీపంలోని గుండ్లకమ్మ నదికి వెళ్ళి ప్రమాద వశాత్తు నీటిలో పడి మరణించింది. పది సంవత్సరాల క్రితం పెద్ద కుమారుడు ఇమ్మానియేలు కూడా గుండ్లకమ్మలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఏపీ ఫైబర్ సేవల్లో తీవ్ర అంతరాయాలు

తరచూ నిలిచిపోతున్న ప్రసారాలు- నానా ఇబ్బందులు పడుతున్న కేబుల్ ఆపరేటర్లు

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా వ్యాప్తంగా తరచు ఏపి ఫైబర్ ప్రసారాలు నిలిచిపోతున్నాయి. దీంతో కేబుల్ ఆపరేటర్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇటీవల ఏపి ఫైబర్ సంస్థ తొలగించింది. బాపట్ల జిల్లాలో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది విధుల నుండి తప్పుకున్నారు. గత నెల రోజుల నుండి ఏపి ఫైబర్ ప్రసారాల్లో తరచూ అంతరాయం కల్గుతుంది. ప్రసారాల అంతరాయంపై మాట్లాడేందుకు ప్రస్తుతం ఉన్న అధికారులు స్పందించడం లేదు. గత ప్రభుత్వం ఏపి ఫైబర్ నెట్ వర్కుపై శ్రద్ధ చూపని కారణంగా కేబుల్ ప్రసారాలు చేసే వైర్లు ఎక్కడ పడితే అక్కడ కిందకు వేలాడుతూ తెగిపోతున్నాయి. వైర్లు తెగి ప్రసారాలు ఆగిపోతే పునరుద్ధరించేవారు లేరు. దీంతో జిల్లా కేంద్రం బాపట్లతో పాటు రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లోనూ అంతరాయం సమస్యతో పలు మండలాల ఆపరేటర్లు వినియోగదారులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. గత నెల రోజుల నుండి ఆపరేటర్లు ప్రైవేట్ టెక్నీషియన్ల ద్వారా తెగిన వైర్లను సరి చేయించుకుంటున్నారు. ప్రసారాల్లో నాణ్యత, తరచూ అంతరాయాల కారణంగా వినియోగదారులు నెలవారీ నగదును ఇవ్వడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. కాని ఇక్కడ నెలవారి నగదును మాత్రం ఏపిఫైబర్ కేబుల్ ఆపరేటర్ల నుండి ముందుగానే తీసుకుంటుంది. పైగా యాక్టివ్‌లో లేని ఏపీ ఫైబర్ సెటప్ బాక్సులకు అద్దె రూపంలో ప్రతి నెలా రూ.60లు వ్యాలెట్‌లో కోత విధిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న వినియోగదారులు అంతరాయాల కారణంగా వేరే నెట్ వర్కులకు మారిపోతున్నారు. దీంతో వినియోగదారులు సంఖ్య తగ్గిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు కేబుల్ ఆపరేటర్ల తమ స్వంత ఖర్చులతో ఏపి ఫైబర్ నెట్ కనెక్షన్లు అందించారు. ఆయా కనెక్షన్లు అందించినందుకు గాను కొంత శాతం నగదును ఆపరేటర్లకు చెల్లిస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కాని గత ప్రభుత్వం పైసా కూడా తమకు చెల్లించలేదని ఆపరేటర్ల చెబుతున్నారు. కరోనా సమయం నుంచి ఐటి ఉద్యోగులు ఇప్పటికి పలుచోట్ల వర్క్ ఫ్రం హోమ్ కొనసాగిస్తున్నారు. వారి కోసం కరోనా సమయంలో ఏపిఎస్ఎఫ్ఎల్ సంస్థ నెట్ కనెక్షన్లు కేబుల్ ఆపరేటర్ల ద్వారా అందించింది. ప్రస్తుతం జరుగుతున్న అంతరాయాల కారణంగా ఐటి ఉద్యోగులు తమ వర్క్‌ను పూర్తి చేయలేక ఈ నెట్‌వర్క్‌తో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆపరేటర్లను నిందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపి ఫైబర్ పరిస్థితి ఇలాగే కొనసాగితే అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆపరేటర్లు చెబుతున్నారు. అవినీతి జరిగిందని ప్రభుత్వం ఏపి ఫైబర్ సంస్థలో కూలంకషంగా సోదాలు చేస్తున్నట్లు వినికిడి. అయితే జిల్లా స్థాయిలో ఉన్న అధికారులను కూడా విచారించడంతో పాటు, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపితే ఇక్కడ ఉన్న దొంగలు కూడా బయటకు వస్తారని ఆపరేటర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు తొలగించిన సిబ్బంది స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని తక్షణ నియామకాలు చేపట్టకపోవడంతో ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాల్లో నిరంతర అంతరాయాలతో వినియోగదారులు, ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే తాత్కాలిక నియామకాలను చేపట్టి తమను రక్షించాలని కేబుల్ ఆపరేటర్లు కోరుతున్నారు. లేనిపక్షంలో ఏపీఎస్ఎఫ్ఎల్‌ను నమ్ముకుని తాము వెచ్చించిన లక్షలాది రూపాయలు నష్టపోతామని ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు.

అధిక రక్తపోటు నియంత్రణతో పక్షవాతం నుంచి రక్షణ

● ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు విజయ



కరపత్రాలను విడుదల చేస్తున్న విజయ, రమణ, సుందరాచారీ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని, వీరిలో 25 శా తం మంది 40 ఏళ్లలోపు వయస్సు వారేనని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో 'చెక్ బీపీ స్టాప్ స్ట్రోక్' క్యాంపెయిన్‌లో భాగంగా రోగులకు, వారి సహాయకులు బీపీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ విజయ రోగులను ఉద్దేశించి మాట్లాడారు. బీపీని ముందుగానే తెలుసుకొని మందులు, ఆహార నియమాలతో నియంత్రిస్తే 80 శాతం వరకు పక్షవాతం సోకకుండా నివారించవచ్చన్నారు. అందువల్ల 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా బీపీ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఒకవేళ బీపీ ఉంటే డాక్టర్ల సలహా మేరకు తగిన మందులు వాడుతూ బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ విజయ సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్‌వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీపీ చెకప్‌కు సంబంధించిన కరపత్రాలను డాక్టర్ విజయ, డాక్టర్ సుందరాచారీ, డాక్టర్ రమణ తదితరులు విడుదల చేశారు. అనంతరం ఐఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, న్యాయవాదుల సంఘం, హోల్ సేల్ మందుల దుకాణ వ్యాపారుల సంఘం, మలినేని ఇంజనీరింగ్‌కాలేజీ, ప్రజావేదిక తదితర ప్రాంతాల్లో ఉచిత బీపీ వైద్యపరీక్ష శిబిరాలను నిర్వహించారు.

స్పందన లేని.. ఫీజు ఆఫ్ కాల్

● సీజీఆర్ఎఫ్‌కు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు
● చైర్మన్, రిటైర్డ్ జడ్జీ విక్టర్ ఇమ్మానుయేల్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లో వోల్టేజ్ సమస్యలపై ఫిర్యాదు చేసినా.. ఫీజు ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్((కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం)కు ఫిర్యాదులు చేశారు. గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ నేతృత్వంలో శుక్రవారం స్థానిక సంగడిగుంటలోని విద్యుత్‌భవన్‌లో అదాలత్ జరిగింది.



వినియోగదారుడు నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఇమ్మానుయేల్, సభ్యులు

మొత్తం 15 సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయగా అక్కడికక్కమే పది సమస్యలను పరిష్కరించినట్లు చైర్మన్ తెలిపారు. కొత్తపేటలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫారం, నాయుడుపేట ప్రాంతంలో లోవోల్టేజ్, ఆంజనేయపేట నివాసాలపై హెచ్‌టీ లైన్లు తదితర ఫిర్యాదులను చైర్మన్ స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో మొత్తం 10 లోపే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులు అవసరమైతే సమస్యలపై గుణదలలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో, 9491034319 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదులను గరిష్ఠంగా రెండు నెలలలోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఆర్థిక, టెక్నికల్ సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, సర్కిల్ ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తదితరులు ఉన్నారు.

వేధింపులు తాళలేక
వివాహిత ఆత్మహత్య

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు చేసుకున్న ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం మండలంలోని గుడివాడకు చెందిన కామంచి ఆమని (34) కొంతకాలంగా గ్రామంలోని ఓ కోళ్లఫారంలో రోజువారి కూలీగా పనిచేస్తున్నది. గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ఆమె వెంట పడుతూ ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేసేవాడు. దానితో ఆగక పదే పదే ఫోన్ చేస్తూ అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడు. దీనిపై ఆమె పనిచేసే కోళ్ల ఫారం యజమాని దృష్టికి తీసుకురాగా మహేష్‌ను పిలిపించి మందలించాడు. దీంతో కొన్ని రోజులు పాటు వేధింపులు ఆపిన మహేష్, ఈ నెల 4న సాయంత్ర సమయంలో కోళ్లఫారంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఆమె వెంటపడటంతో విషయాన్ని భర్తకు చెప్పింది. దీంతో మహేష్‌ను మందలించేందుకు ఇంటికి వెళ్లితే అతడి తల్లి, కుమారుడు కలిసి మూడు సంవత్సరాలుగా ఇద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగుతుందంటూ చెప్పి ఇదే విషయాన్ని గ్రామస్తులందరికీ ప్రచారం చేయడంతో వివాహిత మనస్థాపానికి గురైంది. దీంతో ఈ నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అక్కడ పోలీసులు ఆమె వాంగ్మూలం తీసుకోగా మహేష్, ఆమె తల్లి రమాదేవి చేసిన అసత్య ప్రచారాన్ని తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు చెప్పింది. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఇరువురిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగిన నిందితుడు

వివాహిత ఆమని ఆత్మహత్య కేసులో ఏ-1గా ఉన్న నిందితుడు మహేష్ శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం కేసులో ముద్దాయిలను విచారణకు తీసుకురాగా పోలీసుల కళ్లుకప్పి ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగినట్లు సమాచారం. గమనించిన బంధువులు అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం పొన్నూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్


ఎమ్మెల్యే జూలకంటి సమక్షంలో చేరిక



కౌన్సిలర్ సుభానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘానికి చెందిన 29వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ సుభానిసాహెబ్ మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కౌన్సిలర్ సుభానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పట్టణాభివృద్ధి కోసం పాటుపడడం తమకు నచ్చిందని అం దుకే టీడీపీలో చేరినట్లు కౌన్సిలర్ సుభాని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి పాల్గొన్నారు.

రైలు దోపిడి నిందితులు అరెస్ట్



నిందితుల వివరాలను తెలుపుతున్న జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులపై కర్రలతో దాడి చేసి వారి సెల్‌ఫోన్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై వెం కటాద్రి తెలిపారు. ఈనెల 21న కాకినాడ తిరుపతి ట్రైన్‌లో ప్రయానిస్తున్న మాచర్ల సంతోష్‌కుమార్‌పై నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో కర్రతో దాడి చేసి సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. తన సెల్ ఫోన్ కు కాల్ చేయగా రూ. 20 వేలు ఇవ్వాలని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో దాడికి పాల్పడింది నిడుబ్రోలుకు చెందిన దేవర సాయి, యర్రంశెట్టి వంశీలను గుర్తించి అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరు నిందితులకు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. నిందితులు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామన్నారు.

ప్రధాని భేటీలో సీఎంతో కలిసి పాల్గొన్న జిల్లా ఎంపీలు



గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబుతో కలిసి జిల్లా ఎంపీలు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు పాల్గొనే అవకాశం లభించింది.

హోరాహోరీగా
ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

జూనియర్ విభాగం విజేతలుగా బాపట్ల, తెలంగాణ ఎడ్ల జతలు



మొదటి బహుమతిని కైవసం చేసుకున్న ఎడ్లు

వినుకొండటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా కొనసాగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పలు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు, తెలంగాణకు చెందిన రోహన్‌బాబు ఎడ్లు 3,750 అడు గులు బండ లాగి మొదటి స్థానంలో సమానంగా నిలిచాయి. పోటీల్లో రెండు జతలు మొదటి స్థానంలో నిలబడటంతో మొదటి, రెండో బహుమతిని కలిపి ఇద్దరికీ సమానంగా ప్రదానం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి బుర్రముక్క కౌశల్యారెడ్డికి చెందిన ఎడ్లు 3,508 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు 3,507 అడుగులు లాగి 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఖాజీపురానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి, బండి సాహిత్‌శ్రీభవన్ ఎడ్లు 3,250 అడుగులు లాగి 5వ స్థానం, గుంటూరు రూరల్ మండలం లింగాయపాలేనికి చెందిన యలం సాంబశివరావు ఎడ్లు 3వేలు అడుగులు లాగి 6వ స్థానం, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్ ఎడ్లు 2,910 అడుగులు లాగి 7వ స్థానం, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బొప్పూడివారిపాలేనికి చెందిన చిట్టిపోతు రామాంజనేయులు ఎడ్లు 2,518 అడుగులు లాగి 8వ స్థానం, నల్గొండ జిల్లా నిడమానూరు మండలం సూరేపల్లికి చెందిన ఎస్.అనంతరాములుకు చెందిన ఎడ్లు 2,251 అడుగులు లాగి 9వ స్థానంలో నిలిచాయి. వినుకొండ 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి మొదటి బహుమతి రూ. 80వేలు, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరావు రూ.70వేలు, గీతాంజలి పాఠశాల అధినేత ఎండ్లూరి శేషగిరిరావు రూ.60వేలు, పోకా అనంతబాబు, అజయ్‌బాబు, కామని శ్రీనివాసరావు రూ.50 వేలు, వినుకొండ పట్టణంలోని జయతి హాస్పిటల్ యజమాని డాక్టర్ కాకాని వెంకట సురేంద్ర రూ.40 వేలు, కంచర్ల రాంబాబు, కిరణ్‌బాబు, ఆదిబాబు రూ.30 వేలు, వంకాయలపాటి పేరయ్య రూ.20 వేలు, గురిజాల ఆదినారాయణ రూ.15 వేలు, ఆర్ఎంపీ డాక్టర్స్ సంఘం అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వరావు రూ.10వేలు నగదు విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఉదయం నుంచి సీనియర్ విభాగానికి చెందిన 12 జతల ఎడ్ల పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారిని కట్టడి చేయడం పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. పోటీల సందర్భంగా మదమంచిపాటి స్వామి దేవాలయం ఆవరణలో మక్కెన చినరామయ్య పేరుతో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఈ నెల 18 నుంచి అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని పోటీలను ఆసక్తిగా తిలకించి ఎడ్ల యజమానులను అభినందించారు.కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గుంటూరు కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ సహకారంతో త్వరలో పరిష్కరిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు త్వరలో పూర్తిస్థాయి గ్రాంట్ సాధిస్తానని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న, ప్రమోషన్లు, ఉద్యోగాలు భర్తీ .. మొదలగు అనేక సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలియజేశారు. అలాగే ఉద్యోగులు అందరూ సక్రమంగా పనిచేస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, అధ్యక్షులు తిరుమలశెట్టి నరసింహారావు, పెన్షనర్ సంఘం అధ్యక్షులు మల్లేశ్వరరావు, త్రిమూర్తులు గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు, పెన్షన్ దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, హాజరైన ఉద్యోగులు ,పెన్షనర్లు

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ముఖ్యమంత్రి సహాయనిధితో బాధితులకు న్యాయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం పొందలేని పేద కుటుంబాల వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. కర్లపాలెం మండలం ఎం.వి.రాజుపాలెం గ్రామానికి చెందిన ఆట్ల శివరామకృష్ణారెడ్డికి రూ.2,06,421, ఆట్ల వెంకటేశ్వరరెడ్డికి రూ.1,53,329, ఆట్ల కేశవరెడ్డికి రూ.99,157, బుద్దాం గ్రామానికి చెందిన యేమినేని ఏడుకొండలుకు రూ.92,328, నర్రా శివనాగరాజుకు రూ.62,983, సమ్మెటవారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు కృష్ణారెడ్డికి రూ.62,266, ఎం.వి.రాజుపాలెం గ్రామానికి చెందిన షేక్ మాలిన్‌బేగ్‌కు రూ.58,752, పాతనందాయపాలెం గ్రామానికి చెందిన కుంచాల పిచ్చిరెడ్డికి రూ.50,895, శీలంవారిపాలెం గ్రామానికి చెందిన శీలం నాగిరెడ్డికి రూ.47,175, జయలక్ష్మికి రూ.43,727, కర్లపాలెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్‌కు రూ.40 వేలు, సమ్మెటవారిపాలెం గ్రామానికి చెందిన శీలం వీరాస్వామిరెడ్డికి రూ.35 వేలు, కర్లపాలెం గ్రామానికి చెందిన బిట్టు వెంకటప్రశాంత్‌కు రూ.35వేలు, గూడంశెట్టి సత్యనారాయణకు రూ.31,741 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు షేక్‌బాజి, పిట్ల వసంతరెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజాదర్బార్‌లో ప్రతి సమస్యకు పరిష్కారం : వేగేశన

ప్రజాదర్బార్‌లో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ భరోసానిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సంబంధమైన సమస్యలకు సంబంధించిన మూడు ఫిర్యాదులు, బ్యాంక్‌లోన్‌లకు సంబంధించి రెండు అర్జీలు, రోడ్లుకు సంబంధించి మూడు అర్జీలు, డ్రైనేజిలకు సంబంధించి మూడు అర్జీలు చొప్పున మొత్తం 11మంది ఆయా ప్రాంత ప్రజలతో కలిసి అర్జీలను అందజేసి సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, షాలెంరాజు,కూటమి నాయకులు పాల్గొన్నారు.



గర్భిణులకు బాలసంజీవని కిట్ అందజేస్తున్న బత్తుల పద్మావతి, లక్ష్మీపార్వతి తదితరులు

కిషోర బాలికలపై ప్రత్యేక దృష్టి పెడతాం

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కిషోర బాలికలపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని శృంగారపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణీ,బాలింతలకు అందిస్తున్న కిట్‌లను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న ఆహారపదార్థాలను తనిఖీ చేసి అక్కడ తాగునీటి వసతి కల్పించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసి అంగన్‌వాడీ ఆయాకు మెమో ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణీకి బాలసంజీవని కిట్ అందజేశారు. 6 సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మూడు సంవత్సరాల నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించేవిధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీపార్వతి, సూపర్‌వైజర్‌లు గంటా జ్యోతి, నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బాలికకు వివాహం చేస్తే చర్యలు తప్పవు

బాలికకు వివాహం చేస్తే చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. పట్టణంలో శృంగారపురంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన వారు 9వ తరగతి చదివే బాలికకు వివాహం చేస్తున్నారని తెలుసుకొని ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఆమె శుక్రవారం అక్కడికి వెళ్ళి విచారించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ బిడ్డకు వివాహం చేయటంలేదని 10వ తరగతిలో చేర్పించి చదివిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీపార్వతి, సూపర్‌వైజర్‌లు గంటా జ్యోతి, నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, పోలీసుసిబ్బంది, సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

● మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపుతూ క్రీడాస్ఫూర్తిదాయకంగా, ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలను ఆడాలని పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామపంచాయతీలోని కుర్రా గ్రామంలో శుక్రవారం యువతకు వేసవి సెలవుల దృష్ట్యా క్రీడలను ప్రోత్సాహించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు యువకులకు క్రికెట్ బ్యాట్‌లు, బంతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్మా జాన్‌బాబు, బర్మా శామ్యూల్, చందోలు జగద్‌జీవన్‌రావ్, చందోలు రవి, పలువురు గ్రామపెద్దలు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రికెట్‌బ్యాట్‌లు అందజేస్తున్న డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి తదితరులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో



ఏఎన్‌ఎంలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తదితరులు

కర్లపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీ డీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు ఏబెటు, ఫాగింగ్ చేయాలన్నారు. దోమలు పారద్రోలు పరికరాలు వాడాలన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ముస్లింలకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌బాషా అన్నారు. కర్లపాలెం పంచాయతీలోని ఎం.వి.రాజుపాలేనికి చెందిన నిరుపేద మహిళకు బియ్యం పంపిణీ చేశారు. హైదరాబాద్ సుభాని, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ బాష, షేక్ ఇబ్రహీం, షేక్ జిలానీ, షేక్ నాగురా పాల్గొన్నారు.

కొత్తపాలెంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కర్లపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెంలో ఉన్న గుడిగుంట చెరువులో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం (60) లభ్యమైందని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వీఆర్వో సుభాని ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు.

విపత్తులను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరదలు, తుఫాన్‌లు వచ్చినప్పుడు ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దక్షిణ పశ్చిమ రుతుపవనాలు వీస్తాయనే భారతీయ వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రహదార్లు, విద్యుత్ సౌకర్యం వెంటనే పునరుద్ధరించటానికి అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటానికి తుఫాన్‌షెల్టర్‌ల మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. జిల్లాలో కృష్ణాపరివాహక ప్రాంతంలో కరకట్టకు గండ్లుపడే ప్రాంతాలను గుర్తించి అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టటానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామాపీడీ విజయలక్ష్మీ, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ,జిల్లా సహయ సహకారశాఖాధికారి శ్యామ్‌సన్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాసనాయక్, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొదుపు మహిళల జీవనోపాధుల అభివృద్ధికి చర్యలు

పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 3.39లక్షల మంది పొదుపు మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. వారి స్థితిగతులను మార్చేందుకు 59,812 మంది మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్నారు. ఒక్కొక్క మహిళకు కనీసం లక్ష నుంచి 10 లక్షల వరకు రుణాలు కల్పించాలన్నారు. పాడిగేదెలతో అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఉన్నాయి కావున స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా 12,500 పాడి గేదెల యూనిట్‌లు పంపిణీ చేయటానికి 125 కోట్లు వెచ్చించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మత్స్యకారులకు వేట నిషేధకాల భృతి పంపిణీ

మత్స్యకారులకు చేపలవేట నిషేధ కాల భృతి పంపిణీ కార్యక్రమం శనివారం నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. 12,671 మందికి 25.34 లక్షల రూపాయలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 7,304 మంది, బాపట్లలో 1441 మందికి, చీరాలలో 2,836 మంది, పర్చూరులో 1090 మందికి రూ.20 వేల చొప్పున పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లాలోని గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకగ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించటానికి ప్రతి నాల్గొవ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కర్లపాలెం మండలంలోని 19 గిరిజన సంఘాల యానాదుల కోసం తుఫాన్ భవనం నిర్మించాలని అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులు కోరారు. అదేవిధంగా శ్మశానం కోసం కేటాయించిన స్థలానికి పట్టా మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటగిరి సంజీవరావు, అధికారప్రతినిధి ఏకసిరి నరసింహారావు, రాష్ట్రయూత్ ఆర్గనైజర్ గండళ్ళ నరేష్, రాష్ట్ర యూత్‌అధ్యక్షులు బొజ్జా కోటేశ్వరరావు, బాపట్లజిల్లా అధ్యక్షులు నక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అవార్డు ప్రకటించటంపై అభినందనలు

బాపట్ల రెడ్‌క్రాస్ సంస్థకు ఎక్కువ శాతం సభ్యత్వాలు సేకరించినందుకు గవర్నర్ చేతులమీదగా కలెక్టర్ జె.వెంకటమురళి అవార్డు అందుకోబోతున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కలెక్టర్ అధికారుల సహకారంతో 16 లక్షల రూపాయలు సభ్యత్వాలు, రెడ్‌క్రాస్ సంస్థకు సేకరించిన రూ.2 లక్షలు సంస్థకు అందజేశారు. కలెక్టర్ చేసిన సేవలను గుర్తించి గవర్నర్ మే 8వ తేదీన ఉత్తమ కలెక్టర్‌గా అవార్డు ప్రదానం చేయుటకు ఎంపిక చేసినట్లు గవర్నర్ కార్యాలయం నుంచి శుక్రవారం సమాచారం వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్‌ను రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు తదితరులు అభినందించారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శాంతియుత ర్యాలీ



బాపట్లలో శాంతి ర్యాలీ చేస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు, మాజీ సైనికులు

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం అమరులకు నివాళులు అర్పిస్తూ మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పటిష్ఠమైన రాజ్యాంగనీడలో ఉంటున్న అశేష భారతీయులను విచ్ఛిన్నం చేయటానికి విదేశీ శక్తులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకురాలు విజయమాధురి, ఉపాధ్యాయులు చిల్లా సత్యనారాయణ, కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, మాజీ సైనికులు తోట దుర్గారావు, చినతిరుపతిరావు, అబ్దుల్ రజాక్, రుక్మదరావు, బాజి, కె.ఆంజనేయులు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజేష్, సారథి, వెంకటకృష్ణారెడ్డి, వీరాస్వామి, రాంప్రసాదరెడ్డి, బసివిరెడ్డి, కృష్ణ, వెంకటరమణ, పోతురాజురెడ్డి, సింగయ్య, నాగరాజు, రత్నకుమార్, సంజయ్, దాదా, ఏసుబాబు, బాబి పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో...

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు అన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించిన నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో విలియంబూత్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్యామ్‌లివింగ్‌స్టన్, ఖలీలుద్దీన్, మేకతోటి శరత్, ఐజక్, ప్రవీణ్, ప్రసాదరావు, గొర్ల ఏడుకొండలు, షేక్.ఇలియాజ్, బోయన సూరిబాబు, వడ్లమూడి వెంకటభాస్కరరావు, యర్రాకుల వాసు, దర్శి భాస్కరరావు, కొమ్మనబోయన ఫణికుమార్ పాల్గొన్నారు.

జనసైనికుల నిరసన

కొల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ కొల్లూరులో జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్ప డ్డారు. ఉగ్రదాడిలో మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు సంతాప సూచికంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గ్రామ పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నాయకులు కృష్ణమోహన్, వెంకట్రామయ్య మాట్లాడుతూ, ఉగ్రదాడులను యావత్ సమాజం ఖండించాలని, కేంద్రం పూర్తి స్థాయి సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బి.సుబ్బారావు, ఆటో యూనియన్ నాయకులు దాసు, నాగరాజు, శ్రీను, సురేంద్ర పాల్గొన్నారు.

పెరవలిలో..

వేమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా మండలంలోని పెరవలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. తోట ఉమామహేశ్వరరావు, వేదాంతం శ్రీనివాసరావు, గోపిశెట్టి సతీష్‌బాబు, విష్ణుమొలకల శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెరవలిలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

మే నెలాఖరుకల్లా నీటి తీరువా బకాయిలు చెల్లించాలి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు 2024-2025 సంవత్సరానికి సంబంధించి సాగునీటి తీరువా వసూళ్ళు వీఆర్వోలు మేనెలాఖరికల్లా పూర్తి చేసేందుకు కృషి చేయాలని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వీఆర్వోలు, వీఆర్ఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లు విక్టర్, మధు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రజాప్రతినిధులు అభినందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈవో ఎస్.దేవరాజు అధ్యక్షతన శుక్రవారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఎంపీపీ డీవీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొని మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించగా 33 మంది విద్యార్థులు 550 కంటే ఎక్కువ మార్కులు సాధించారని, 600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 531 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఉత్తీర్ణత 88.5 శాతం నమోదైనట్లు ఎంఈవో దేవరాజు తెలిపారు.

కొల్లూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించారు. శుక్రవారం కొల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొల్లూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి అభిమానుల కోరిక మేరకు కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. టోర్నమెంట్ మొదటి బహుమతి రూ.50 వేలు గెలుపొందిన జట్టుకు ఎమ్మెల్యే అందిస్తారని, రెండో బహుమతి మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ రూ.30 వేలు, మూడవ బహుమతి తుమాటి శ్యాంబాబు రూ.20 వేలు ఆయా జట్లకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పీ4 సర్వేలో 2038 కుటుంబాల ఎంపిక

చెరుకుపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : గత నెలలో నిర్వహించిన పీ4 సర్వేలో 2038 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడం జరిగిందని, ఈ కుటుంబాల అవసరాలను గుర్తించి వారి స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రతి ఐదు కుటుంబాలకు ఒక మార్గదర్శిని ఎంపిక చేయాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, సేవాభావం కలిగిన వారు ఎవరైనా సరే ఐదు కుటుంబాలను ఎంపిక చేసుకుని మార్గదర్శిగా ఉండి వారి స్థితిగతులను మెరుగుపరచడానికి కృషి చేయాలన్నారు. 2038 కుటుంబాలలో ఐదు కుటుంబాలకు ఒకరిచొప్పున 410 మంది మార్గదర్శులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను కోరారు. సచివాలయ సిబ్బంది వారి కుటుంబ అవసరాలను సర్వే చేసి గుర్తించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని

జనసేన నేత రాజేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

● మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

వేమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చావలి గ్రామానికి చెందిన దళిత యువకుడిని కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టిన జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్‌ను జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు డిమాండ్ చేశారు. వేమూరులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు తనకు బినామీగా ఉండలేదని ఊసా రాజేష్, కొండయ్యను కులం పేరుతో దూషించి కొట్టడం అమానుషమన్నారు. చావలి గ్రామంలో ప్రభుత్వ అండదండలతో అరాచకాలు చేస్తూ దళిత యువకుడిని కొట్టిన రాజేష్‌పై చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బాధితుడు కొండయ్య, మాజీ ఎంపీటీసీ సునీల్, దాసరి ప్రతాప్, కనపర్తి నాంచారయ్య పాల్గొన్నారు.



పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పబ్లిక్ గ్రీవెన్స్‌కు విశేష స్పందన

● సమస్యలపై ఎమ్మెల్యే ఆనందబాబుకు అర్జీలు అందించిన ప్రజలు

● ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచన

కొల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జాతీయ టీడీపీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. ప్రధానంగా కొల్లూరు లాకులపై వంతెన నిర్మాణాలు, ఓలేరు వద్ద కృష్ణానదిపై చెక్‌డ్యాం నిర్మాణం, పోతార్లంక నుంచి జువ్వలపాలెం వరకు కృష్ణానది కట్ట కోత పడకుండా గ్రాయిన్స్ నిర్మాణాలు, శ్మశాన వాటికలు మంజూరు చేయాలని అర్జీలు అందించారు. గ్రీవెన్స్‌లో అధిక శాతం అర్జీలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న బి-1, భూసమస్యలపై వచ్చినట్లుగా అధికారులు తెలిపారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే సూచించారు. చెక్‌డ్యాం, గ్రాయిన్స్, లాకులపై వంతెనల నిర్మాణం వంటివి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వేదికపై ఎంపీడీవో కె.నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బీమా చెక్కును శుక్రవారం అందజేశారు. మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన కార్యకర్త కంచర్ల ఏసుబాబు రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుని కుటుంబానికి భరోసాగా పార్టీ అందించిన బీమా చెక్కు రూ.5 లక్షలు ఎమ్మెల్యే ఆనందబాబు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ మధుసూదన ప్రసాద్, జువ్వలపాలెం మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి), డీసీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

7,304 మంది మత్స్యకారులకు చేయూత

● నేడు మంత్రి అనగాని చేతుల మీదగా పంపిణీ

రేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెలబెట్టుకోనున్నదని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో మత్స్యకారుల చేయూత పంపిణీ సభాప్రాంగణాన్ని వివిధ శాఖల అధికారులతో శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు రూ.10 వేలు ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసి గత సంవత్సరం మత్స్యకార భరోసా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలల కాలంలోనే మత్స్యకారుల వేట విరామభృతి రూ.20 వేలకు పెంచి అందించనున్నదని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో 7,304 మందికి మత్స్యకార భృతిని శనివారం కొత్తపాలెం గ్రామంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో నర్రా నాగమణి, మత్స్యశాఖాధికారులు, కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు దండుప్రోలు వెంకటేశ్వరరావు, పిచ్చియ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న శివప్రసాద్, అధికారులు

ప్రజా ఫిర్యాదులను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు బొర్రా సూర్యరాజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 48 ఫిర్యాదులు అందాయి. ఆయన మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి రోజురోజుకు స్పందన పెరుగుతుందని, ఇచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కారం అవుతున్న నేపథ్యంలో ఎక్కువ అర్జీలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పొన్నూరి గౌరీరామకుమారి పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఫిర్యాదులు పరిశీలిస్తున్న నాయకులు

అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఎస్వీఆర్ఎం కళాశాల : ప్రిన్సిపాల్

నగరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : డిగ్రీలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ మారుమూల ప్రాంతం ఆదర్శవంత కళాశాలగా అందరికి ఎస్వీఆర్ఎం కళాశాల అందుబాటులో ఉంటుందని నగరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. హరికృష్ణ మాట్లాడుతూ 156 మంది విద్యార్థులకు 155 మంది ఉత్తీర్ణతను సాధించారని, దీని ద్వారా 99 శాతం పాస్ ఉత్తీర్ణ త పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, కంట్రోలర్ ఎగ్జామినర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, కళాశాల సూపరింటెండెంట్ అమిరేష్‌రెడ్డి పాల్గొన్నారు.


హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సంవత్సరాలుగా హైర్ బస్సు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. రేపల్లె డిపో పరిధిలో పని చేస్తున్న హైర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం డిపో మేనేజర్ సునిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. మధర్‌థెరిస్సా హయ్యర్ బస్సు నాయకులు ఎ.వెంకటనాగగోపి, రవికుమార్, ఇంద్ర పాల్గొన్నారు.

రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అక్తర్ హుస్సేన్ అన్నారు. అద్దేపల్లి రైతు సేవా కేంద్రంలో భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై శుక్రవారం ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఏవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ, పచ్చిరొట్ట పైర్ల సాగు చేసుకుని భూసారం పెంపొందించుకోవాలన్నారు. ఏఈవో అఖిల, రజిని రైతులు పాల్గొన్నారు.

..ఆ చెట్టు నీడన



భానుడు భగభగ మండినా..చల్లని ప్రేమను మానుకోలేదు

చల్లని పల్లెగాలి.. నీడనిచ్చే ఈ చెట్ల వద్దకు రాగానే.. కాసేపు సేద తీరాలి అనే కోరిక కలుగుతుంది. గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని చెట్లు చరిత్ర పుటల్లో నిలిచి.. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక ఆనందాన్ని ఇస్తున్నాయి. వాటిలో ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర. వాటి స్థితిగతులను బట్టి దశాబ్దాలుగా వాటిని ప్రత్యేక పేర్లతో పిలుస్తున్నారు. మన పూర్వికులు నాటిన మొక్కలే నేడు మానులైన గ్రామ, పట్టణ చరిత్రలో పేరుగాంచాయి.

చెట్టు పేరుమీదే సెంటర్లు

పెదకూరపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదకూరపాడు మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్, జెండా చెట్టు సెంటర్లు ఫేమస్. ఈ రెండు సెంటర్లలో ఉన్న అరుగులపై ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు కూర్చుని ముచ్చట్లు పెట్టుకుంటారు. గారపాడు గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చెట్ల వద్ద ఆయా గ్రామాల ప్రజలు ఎండలకు సేద తీరుతారు.

అందమైన అనుబంధం



చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుండి వేటపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో బ్రహ్మంగారి చెట్టు ఉంది. ఇక్కడ ఈ ఆలయం వెలసి సుమారు 300 ఏళ్లు కాగా, సుమారు 80 సంవత్సరాల క్రితం స్థానికులు ఆలయానికి ఆనుకుని ఓ రాగి మొక్కను నాటారు. అనంతరం మహా వృక్షంగా బ్రహ్మంగారి చెట్టు అని పిలిచేలా రూపాంతరం చెందింది. అలాగే పేరాల ముత్యాలమ్మ పేటలో వేంచేసియున్న మహాలక్ష్మమ్మ చెట్టు సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు ఈ చెట్టు నీడలో సేద తీరుతున్నారు.

- మండు వేసవిలో చల్లటి నీడనిస్తున్న వృక్షాలు
- ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర.. వాటి పేరు మీదే సెంటర్ల ఏర్పాటు
- సేద తీరేందుకు, రచ్చబండకు, చిరు వ్యాపారాలకు అవే వేదికలు

బాటసారులు సేదతీరే జమ్మిచెట్టు



కొల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ జమ్మి చెట్టు వద్ద పూర్వకాలం నుంచి బాట సారులు సేద తీరుతున్నారు. కొల్లూరు నడిబొడ్డులో అనంత భోగేశ్వర స్వామి, పార్వతీ అమ్మవార్ల దేవస్థానాల ఆధ్వర్యంలో జమ్మి చెట్టును నాటారు. అప్పటి నుండి బాట సారులకు ఆ చెట్టు నీడ కల్పి స్తోంది. దాతలు బాటసారులు కూర్చునేందుకు చెట్టు చుట్టూ పెద్ద అరుగు నిర్మాణం చేశారు. దసరా ఉత్సవాల్లో పార్వతీ అమ్మవారికి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

వందల ఏళ్లుగా నీడనిస్తూ..



దాచేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల నుంచి గ్రామస్తులకు నీడనిస్తున్న.. ఈ రావి చెట్టును చూస్తే గ్రామస్తులకు ఎన్నో మధుర జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. అప్పటి గ్రామ పెద్దలుగా ఉన్న కరణం, మును సుబులు ఈ చెట్టు నీడన కూర్చొని గ్రామస్తుల చిన్న చిన్న తగాదాలను, వివాదాలను పరిష్కరించేవారు. కేసానుపల్లిలోని రావి చెట్టు అంటే ఆ గ్రామస్తులకు ఎంతో మక్కువ. చెట్టు నీడలో గ్రామస్తులు విశ్రాంతి తీసుకుంటారు.

ప్రత్యేక గుర్తింపు




అద్దంకి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో రెండు ప్రాంతాలకు ఆ చెట్ల పేర్లుతోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకటి హిందువులు భక్తిశ్రద్ధలతో కొలిచే మహలక్ష్మమ్మ చెట్టు కాగా, మరొకటి ముస్లింలు పవిత్రంగా భావించే జెండా చెట్టు కావడం విశేషం. అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెంలో తరతరాల క్రితం మహలక్ష్మమ్మ చెట్టు ఉంది. దశాబ్ద కాలం క్రితం చెట్టు ఉన్న ప్రాంతంలోనే మహలక్ష్మమ్మ విగ్రహం ఏర్పాటు చేసి మహలక్ష్మమ్మ దేవాలయం నిర్మించారు. ఇక భవాని సెంటర్ సమీపంలో ఉన్న దూదేకులపాలెంలో ఉన్న వేప చెట్టు.. జెండా చెట్టుగా గుర్తింపు పొందింది. సుమారు శతాబ్ద కంటే ముందు నుండే జెండా చెట్టు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

బాపట్ల నడిబొడ్డున మహాలక్ష్మీఅమ్మవారి చెట్టు



బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల చరిత్రకు చిహ్నమైన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయానికి సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో శతాబ్దకాలానికి పైగా వెలిసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారి చెట్టు భక్తుల కోర్కెలు తీరుస్తోంది. నాలుగు దేవాలయాలకు మధ్యలో నాలుగు రోడ్ల కూడలి వద్ద మహాలక్ష్మీ అమ్మవారి చెట్టు ప్రసిద్ధిగాంచింది. నూతన వధూవరులు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు. బాపట్ల గడియార స్తంభం దగ్గర ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ చెట్టు దగ్గర నిత్యం వందలాది మంది వలస కూలీలు పనుల కోసం వచ్చి చెట్టు నీడన నిలబడి సేద తీరుతారు. కూలీలు కావాల్సిన వారు ఈ చెట్టు దగ్గరకొచ్చి మాట్లాడుకొని తీసుకెళ్తారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ చెట్టు నీడన ఉండి పర్యవేక్షిస్తుంటారు.

చిలకలూరిపేటలో మహా వృక్షాలు



చిలకలూరిపేట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న మహా వృక్షాలు పలు చోట్ల ఉన్నాయి. స్థానిక గడియార స్తంభం వద్ద నుంచి ఓగేరు వాగుకువెళ్లే బ్రహ్మంగారి గుడి రోడ్డులో వందల సంవత్సరాల నాటి రాగి, మర్రి, వేప చెట్లు ఉన్నాయి. ఈ చెట్ల వద్దకు వెళ్లి పూజలు చేసే ఆనవాయితీ దశాబ్దాల తరబడి కొనసాగుతోంది. 300 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ మహావృక్షం 2022 లో మోడుబారిపోయింది. దీంతో స్థానికులు కడియం నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న వేప చెట్టును మూడేళ్ల క్రితం తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నాటారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆ చెట్టు వద్ద ఏర్పాటు చేశారు. చీరాల రోడ్డు లోనే 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న వెంకటేశ్వర స్వామి చెట్టు (చింత చెట్టు) కూడా ఉంది. ఈ చెట్టు వద్ద శంకు చక్ర నామాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పండరీపురంలో ఆరవ లైన్ లో ఉన్న వేప చెట్టు కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగీ ఉంది. ఇక్కడ పెళ్లిళ్ల సమయంలో దేవుడుకు ఎదురు నడిచే ఆనవాయితీ ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్నది.

మండు వేసవిలో అక్కున చేర్చుకుంటూ...



రేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి అల్లాడిపోయే ప్రజలను.. చల్లటి గాలి వీస్తూ.. తన నీడలో అక్కును చేర్చుకుంటుంది ఈ చెట్టు. దీని చరిత్ర ఆరు దశాబ్దాలకు పైమాటే.. రేపల్లె పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో ఉన్న ఈ వృక్షాన్ని అంకమ్మ చెట్టుగా పిలుస్తారు. ఏటా పాతపట్నంలోని ప్రజలు ఈ చెట్టుకు కొలుపులు కొలుస్తూ సద్ది నైవేధ్యాలు సమర్పిస్తూ దేవతా మూర్తిగా కొలుస్తారు. ప్రయాణికులు అంకమ్మ చెట్టు నీడలో సేద తీరుతుంటారు. పాత పట్నం వాసులు సాయంత్రం 4 నుండి 7గంటల వరకు ఈ చెట్టు నీడనే వివిధ రకాల సమావేశాలు నిర్వహించుకుంటూ ఉంటారు. మండలంలోని పేటేరు గ్రామంలో సీతామహలక్ష్మీ చెట్టు పేరొందింది. పలువురికి నీడనిస్తూ రచ్చబండగా మారింది. ఈ వృక్షం వయస్సు.. సుమారు 60 ఏళ్ల పైమాటే.. ఐదేళ్ల క్రితం ఈదురుగాలులకు పెద్దకొమ్మలు విరిగిపోయాయని.. లేకుంటే ఇంకా నీడగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఐదు దశాబ్దాలకు పైగా ఆదరణ



తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెనాలి నాజరుపేటలోని మహలక్ష్మమ్మ చెట్టు సెంటర్. ఐదు దశాబ్దాలకు పైగా ఈ కూడలి జనాదరణ పొందింది. ఆ ప్రాంతంలోని వారంతా ఉదయం, సాయంత్రం అక్కడ చేరి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. పూర్వీకులు ముఖ్యమైన ప్రాంతాల్లో చెట్లు నాటి ఆలయాన్ని నిర్మించి అక్కడ చేరి మాట్లాడుకునేవారు. కాలం మారిపోవడంతో నాటి ప్రాముఖ్యత ప్రస్తుతం తగ్గిపోయింది. ఆ ప్రాంతాలను చూసిన వృద్ధులకు ఇప్పటికీ నాటి ఊసులు గుర్తు చేసుకుంటూ.. ఆనందంతో చెప్పుకుంటారు.

తరాల నాటి వేపచెట్టు



పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో తరాల నాటి వేపచెట్టు ప్రయాణికులకు, ప్రజలకు సేద తీర్చేందుకు నిలయంగా మారింది. మండుటెండలో విలవిల్లాడుతున్న వారు ఈ వేపచెట్టు నీడ కిందుకు చేరుకొని సేద తీరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు.. రద్దీగా ఉండే బొమ్మల సెంటర్ కూడలిలో కనీసం ఒక్క బస్సు షెల్టర్‌కూడా లేకపోవడంతో ఈ వేప చెట్టు కిందనే వేచి ఉండి ఆయా మార్గాలకు ప్రయాణిస్తున్నారు. చిరువ్యాపారులు కూడా ఇదే చెట్టును ఆవాసంగా చేసుకొని వ్యాపారాలు సాగిస్తుంటారు.

- పర్చూరు, ఆంధ్రజ్యోతి

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో..

● కీబోర్డు వాయిద్యంలో పలువురికి చోటు

మాచవరం, రేపనల్లె, తుళ్లూరు ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మాచవరం మండలం మోర్జంపాడు గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలుగా విధులు నిర్వహిస్తున్న గారపాటి మణిదీప్తి చోటు సంపాదించింది. డిసెంబరు 1, 2024లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు ఫాస్టర్ అగస్టీన్ దండిగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్‌లైన్‌లో గంట పాటు సరళి స్వరాలను కీ బోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్‌స్ట్రాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్టు మణిదీప్తి తెలిపారు. 1,100 మంది పాల్గొనగా 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికైనట్టు తెలియ జేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఫాస్టర్ దిండిగి చేతుల మీదుగా మణిదీప్తి ఈ అవార్డును అందుకున్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న మణిదీప్తి



సర్టిఫికెట్ అందుకుంటున్న అమూల్య

ఆలా అమూల్య...

రేపల్లె పట్టణంలోని 5వ వార్డుకు చెందిన చిన్నారి ఆలా అమూల్య మ్యూజికల్ కీబోర్డు ఇన్‌స్ట్రూమెంట్‌లో ప్రతిభ కనబరిచి గిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. పట్టణానికి చెందిన ఆలామోషే, లావణ్య వారాల రెండో కుమార్తె ఆలా ఆమూల్య. నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తోంది.




సర్టిఫికెట్ అందుకుంటున్న సంవేద్ బాబు

సంవేద్ బాబు..

తూళ్లూరు మండలంలోని రాజధాని గ్రామం బోరుపాలెం బుడ్డోడు సంవేద్‌బాబు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. 50 సెకన్ల వ్యవధిలో సరళి స్వరాలను స్పష్టంగా అత్యంత వేగంగా పలికించినందుకు గాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. సంవేద్ బాబుకి మెడల్, సరిఫికెట్ ప్రదానం చేశారు. గతంలో ఇంజినీయెస్ వరల్డ్ రికార్డులో సంవేద్ బాబు స్థానం సంపాదించాడు. గత ఎన్నికల్లో తాడికొండ నియోజక వర్గం నుంచి టీడీపీ తరుఫున ఎమ్మెల్యే టికెట్ ఆశించిన తోకల రాజవర్ధన్ కుమారుడే సంవేద్‌బాబు. 8వ తరగతి చదవుతున్నాడు.

ఉత్సాహంగా కేంద్రీయ విద్యాలయం బాలికల కబడ్డీ పోటీలు



సర్టిఫికెట్లతో బాలికల కబడ్డీ జట్టు

గుంటూరు (విద్య)ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నల్లపాడు లోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఎస్.విజయ్ కుమార్, హెచ్‌ఎం ఎస్.ఆనంద్, పీఈటీ అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరుపతి షిఫ్ట్- 1 ప్రథమ బహుమతి తిరుపతి షిఫ్ట్ 2 ద్వితీయ బహుమతి, గుంటూరు షిఫ్ట్ 1 జట్టు ప్రత్యేక బహుమతులు అందుకున్నాయి. సర్టిఫికెట్లు పథకాలు అందజేశారు.



తల్లిదండ్రులతో సివిల్స్ విజేత చల్లా పవన్ కల్యాణ్

పత్రికా పఠనం వల్లే సివిల్స్‌పై ఆసక్తి

యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'చిన్నప్పటి నుంచి నాన్న (చల్లా రమేష్) ప్రభావం నా మీద ఎక్కువగా ఉండేది. పేపర్లు చదవడం కూడా అలానే అలవాటు అయ్యింది. పత్రికా పఠనం వల్లే పొలిటికల్ సైన్స్‌పై ఆసక్తి పెరిగి సివిల్స్ వైపు వెళ్లేలా చేసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం క్యాంపస్‌లోనే వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తే.. నేను స్థిరపడతాను. కానీ, ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి కన్న కలలు నిజం కావు. అందుకోసమే ఆ ఉద్యోగం వద్దని సివిల్స్ కోసం కష్టపడ్డాను.' అని యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్ అంటున్నారు. సివిల్స్ ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పవన్ ప్రాథమిక విద్యను గుంటూరులోనే పూర్తిచేశారు.

వెంకటేశ్వర బాలకుటీర్‌లో క్రమశిక్షణ..

గుంటూరులోని వేంకటేశ్వర బాలకుటీర్‌లోనే పదో తరగతి వరకు చదివాను. అక్కడ క్రమశిక్షణ.. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు మనసులో చెరిగిపోని ముద్ర వేశాయి. తిరుచ్చిలో బీటెక్ పూర్తి చేస్తున్న సమయంలో అమెరికా బేస్ ఉన్న సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. కానీ, ఆ ఉద్యోగంలో చేరడం నాకు ఇష్టం లేదు.

ముచ్చటగా మూడోసారి

ప్రజలకు సేవ చేయాలంటే కచ్చితంగా సివిల్ సర్వీస్‌కు వెళ్లాల్సిందేనని నిర్ణయించుకున్నాను. 2020 నుంచి సిద్ధమవుతున్నాను. మొదటి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. రెండవ ప్రయత్నంలో మెయిన్స్ క్లియర్ చేశారు. కానీ, ఇంటర్వ్యూ పోయింది. మూడోవ ప్రయత్నంలో 146 ర్యాంకు వచ్చింది.

స్మార్ట్ వర్క్ తప్పనిసరి

సివిల్స్‌లో విజయం సాధించాలంటే హార్డ్ వర్క్‌తో పాటు.. స్మార్ట్ వర్క్ కూడా ఖచ్చితంగా తెలిసి ఉండాలి. ఏది ఎంత వరకు చదవాలో.. అంత వరకే చదవాలి. ఏది ఎప్పుడు చదవాలో అప్పుడే చదవాలి. నేను కూడా ఇదే పద్ధతిని అవలంబించాను. పరీక్షలు దూరంగా ఉన్నప్పుడు రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు చదివే వాడిని. పరీక్షలు దగ్గరికి వచ్చే కొలదీ రోజుకు 7 నుండి 10 గంటల వరకు చదివే వాడిని. కొంతమంది సీనియర్లు సలహాలు సూచనలు కూడా తీసుకొని ముందుకు వెళ్లాను. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కలిసి.. కొన్ని సూచనలు, మెళకువలు నేర్చుకుని నా ప్రయత్నానికి మెరుగులు దిద్దుకున్నాను.

చివరి ప్రశ్న మరిచిపోలేనిది

ఇంటర్వ్యూలో నన్ను అడిగిన చివరి ప్రశ్న ఎప్పటికీ మరచిపోను. నాకు భౌగోళిక చిత్రాలను గుర్తించడం అలవాటు అని దరఖాస్తులో పేర్కొన్నాను. అంటే ఏదైనా ఒక ప్రాంతానికి చెందిన ఫొటోను చూసి.. అది ఏ ప్రాంతమో గుర్తించడం అన్న మాట. ఇంటర్వ్యూలో నాకు ఒక ఫొటో చూపించి ఇది ఎక్కడిదో చెప్పమన్నారు. అది కొచ్చి లోనిది కాబట్టి అదే సమాధానం చెప్పా. ఇంటర్వ్యూ చేసే వాళ్లు కూడా ఆ సమాధానం విని కొంత ఆశ్చర్యానికి లోనయ్యారు.

పత్రికల పఠనంతో విషయ పరిజ్ఞానం

అందరికీ వెంటనే విజయం వరిస్తుందని చెప్పలేం. ఒకటికి రెండు సార్లు సివిల్స్ ప్రయత్నించే వాళ్లు.. ఏదో ఒక ఉద్యోగం చేస్తూ పరీక్షలకు హాజరు కావడం మంచిది. దానివల్ల తల్లిదండ్రులపై పెద్దగా భారం పడకుండా ఉంటుంది. పత్రికలు చదవడం వల్ల కూడా చాలా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.

ప్రజలకు వీలైనంత సేవ చేస్తా

ఏ లక్ష్యంతో అయితే సివిల్స్‌కి వెళ్లాలని అనుకున్నానో అదే లక్ష్యంతో ముందుకు వెళ్తాను. చిన్నప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పరిస్థితి పూర్తిగా చూశాను కాబట్టి ప్రజలకు ఎంతవరకు సేవ చేసే అవకాశం ఉంటే అంత వరకు సేవ చేస్తాను.

సీఐటీయూ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- మేడే సాంస్కృతిక, క్రీడా వారోత్సవాలను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా ఉద్యోగ, కార్మికుల క్రీడా సాంస్కృతి వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఐటీయూ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్రవ్యాప్తంగా మే డే సందర్భంగా క్రీడా సాంస్కృతి వారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మే 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 8 గంటల పని విధానం, సమ్మె డిమాండ్లను ప్రచారం చేయడం కోసం మే డే వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ నిర్వహిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు కె.రూఫస్ పాల్గొన్నారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు మిర్చి కింగ్స్‌పై రాజు ఏఎన్యూ టీం విజయం సాధించింది. రెండవ మ్యాచ్ జీఎంసీ వారియర్స్ వర్సెస్ సీఆర్‌డీఏ సర్కిల్ ఎలక్ట్రిసిటీ మధ్య జరిగింది.

సమాజ శ్రేయస్సుకే

మానవ మేధస్సు

● విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జి.కొండలరావు



డాక్టర్ జి.కొండలరావుకు సన్మానం

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మానవ మేధస్సును సమాజ శ్రేయస్సుకే వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ వార్తా పూర్వ విభాగాధిపతి డాక్టర్ జి.కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్, జర్నలిజం విభాగాల ఆధ్వర్యంలో గుంటూర యునెస్కో క్లబ్ సమన్వయంతో 'సాంకేతిక యుగంలో విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కొండలరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు అధ్యాపకుల సలహాలు, సూచనలతో తమ భవిష్యత్తును ఉత్తమమైన జీవన విధానంగా మలుచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యఅతిథి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు తమ కాలం నాటి విద్యా వ్యవస్థ, నేటితరం విద్యా విధానాల మధ్య వ్యత్యాసాలను వివరించారు. గౌరవ అతిథి, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సదస్సు సంచాలకులు కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య రామినేని శివరామప్రసాద్, పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి పాల్గొన్నారు. డాక్టర్ జి.కొండలరావును ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, అతిథులు, యునెస్కో గ్రూప్ గుంటూరు క్లబ్ నిర్వాహకులు పరమేశ్వరరావు సన్మానించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

14న చీరాల మున్సిపాలిటీలో అవిశ్వాస పరీక్ష

ఇప్పటికే అధికారుల నుంచి కౌన్సిలర్లకు అందిన నోటీసులు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంపై అధికారులు మే 14వ తేదీన బలనిరూపణ చేయనున్నారు. అందుకు సంబంధించి సమావేశానికి హాజరు కావాలని శుక్రవారం 33 వార్డుల కౌన్సిలర్లకు నోటీసులు అందాయి. అవిశ్వాసానికి వెళ్లిన కౌన్సిలర్లు పొందుపరిచిన అంశాల్లో ముఖ్యంగా చైర్మన్ పలు చోట్ల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు పాల్పడ్డారని వివరించారు. అంతేకాకుండా ప్రజాప్రతినిధులైన వారికి ఎటువంటి గౌరవం ఇవ్వడం లేదని పొందుపరచడం గమనార్హం. ప్రస్తుతం ఈ విషయం పట్టణంలో హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్-25 హాల్ టిక్కెట్లు విడుదలైనట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఈనెల 30న జరుగుతుందని, హాల్‌టిక్కెట్లను పాలిసెట్ ఏపీ.నిక్.ఇన్ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సుల్లో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈసెట్ నోటిఫికేషన్ విడుదలైందని షైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ కళాశాలలు, ప్రభుత్వ డైట్‌లలో ప్రవేశాలకు అభ్యర్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షకు మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఫీజు చెల్లింపునకు మే 7వతేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు డీఈఈ సెట్‌కు దరఖాస్తుకు అర్హులు. మే 20నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. జూన్ 2,3 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తారని సుబ్బారావు పేర్కొన్నారు.

అభ్యంతరాలకు నేటితో ఆఖరు : డీఈవో

ఒంగోలు విద్య, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు శనివారం తుది గడువు అని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యా పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లుగా, స్కూలు అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు జిల్లావిద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. జాబితాలో అభ్యంతరం ఎక్కడుందో పేర్కొంటూ తగిన ఆధారాలు కూడా అందజేయాలన్నారు.

నేటితో ముగియనున్న వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరి కింద బదిలీ పొందేందుకు వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ శనివారంతో ముగియనుంది. ఈనెల 24నుంచి ఒంగోలులోని రిమ్స్‌లో ఈ వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీకి మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీచర్లు మొదటి రోజు 230 మంది, శుక్రవారం 116 మంది వైద్య పరీక్షలకు హాజరయ్యారు. శనివారంతో ఈ మెడికల్ బోర్డు వైద్య పరీక్షల గడువు ముగుస్తుందని డీఈవో కోరారు.

ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): యువ ప్రకాశం పేరుతో వేసవిలో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం యువజన సంక్షేమశాఖ కార్యాలయం ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. 30 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాటర్‌మేనేజ్‌మెంట్, హెల్త్, పంచాయతీరాజ్, ఉపాధి కల్పన, మహిళా శిశు ఆరోగ్య, రోడ్లు, భవనాలు, నగర అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

సమస్యలే ఇతివృత్తాలుగా నాటిక ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలనలో జాష్టి వెంకట మోహనరావు, బాబూరావు,పలు కళాపరిషత్ ల అధ్యక్షులు



జనరల్ బోగీలు నాటికలో ఓ సన్నివేశం

మార్టూరులో రెండవరోజు కొనసాగిన రోటరీ కళాపరిషత్ నాటికపోటీలు

మార్టూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రెండో రోజు 15వ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలను ప్రదర్శించారు. తొలుత శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే జనరల్ బోగీలు నాటిక ప్రదర్శితమైంది. మన కుటుంబాలు నిత్యం ప్రయాణించే రైలు జనరల్ బోగీలలో ప్రయాణించేవారి వివరాలు రైల్వే వారి దగ్గర ఉండాలని, జనరల్ బోగీలు సంఖ్య పెరగాలని, ఇలా లేనందువలన జరుగుతున్న ఇబ్బందులకు చక్కగా ఈ నాటికలో వివరించారు. తరువాత శ్రీచైతన్య కళాస్రవంతి విశాఖ పట్టణం వారు ప్రదర్శించిన (అ)సత్యం నాటిక రోజూ మన కళ్లెదుట జరుగుతున్న కొన్ని యథార్థ సంఘటనలను ఉదహరిస్తూ కళాకారులు నాటికను ప్రదర్శించారు. మన కంటికి కనిపించేదంతా సత్యంకాదు, కంటికి కనిపించనిదంతా అసత్యం కాదు అనే దృక్పథంతో నాటిక ప్రదర్శన సాగింది. చివరగా మనుషులు బంధాలు, అనుబంధాలు, వాటి విలువల మధ్య రక్షణగా, సంతోషంగా ఉంటారనే విషయాన్ని కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన రుతువులేని కాలం నాటిక రోజూ మన కుటుంబాలలో జరుగుతున్న సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం

తొలుత నటరాజ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, ఎవర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, అనంతవరం ఎన్‌టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, వరగాని కళాపరిషత్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వీరన్నపాలెం కళాపరిషత్ అధ్యక్షుడు వైవీ చౌదరిలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజరు ఏవీ బాబూరావు మాట్లాడుతూ రోటరీ కళాపరిషత్ నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఈశ్వర ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, జాష్టి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, రావి అంకమ్మచౌదరి, మాదాల సాంబశివరావు, గుండవరపు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రదర్శించనున్న నాటికలు

ముగింపురోజు శనివారం రాత్రి విశ్వశాంతి కల్చరల్ హైదరాబాదు వారిచే స్వేచ్ఛ నాటిక,తరువాత అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే విడాకులు కావాలి నాటిక, చివరగా శ్రీ మైత్రి కళానిలయం, విజయవాడ వారిచే బ్రహ్మస్వరూపం నాటికను ప్రదర్శిస్తారు.

ఆలోచింపజేసిన 'యాభై కోట్లు' నాటిక

ప్రదర్శించిన శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు

మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : వారు రంగస్థల కళాకారులు కాదు, ఏనాడూ నాటికల ప్రదర్శనలు చేయలేదు. వివిధ వృత్తులలో స్థిరపడిన ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, వారందరూ మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు. వారికి కళారంగంపై ఆసక్తి ఉంది. కళాకారులను ప్రోత్సహించాలనే తపన ఉంది. ఈ ఉద్దేశ్యంతోనే గత 14 ఏళ్లనుంచి మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఉభయ రాష్ట్రాల తెలుగు నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గురువారం నుంచి మార్టూరులో నిర్వహిస్తున్న 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలలో కొంతమంది శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు ప్రదర్శించిన నాటిక యాభై కోట్లు ఆ తరువాత నాటిక ప్రేక్షకులను ఆకట్టుకోవడమే గాకుండా అందరినీ ఆలోచింపచేసింది. కేవలం డబ్బుసంపాదన వ్యామోహంలో మునిగిపోయిన భార్యాభర్తలు మానసిక ఒత్తిడికి లోనై వారు అనారోగ్యానికి గురవుతూ, వారి తల్లిదండ్రులను, పిల్లల భవిష్యత్తును పట్టించుకోకుండా, దీపం చుట్టూ తిరిగే మిణుగురు పురుగుల్లాగా,డబ్బు సంపాదనే ధ్యేయంగా జీవనం సాగిస్తున్న భార్యాభర్తలు చివరకు ఏం కోల్పోయారో, ఎంత సంపాదించినా ఈ తరువాత ఏమిటనే ఇతివృత్తంతో సాగిన ప్రదర్శన ప్రేక్షకులను మనస్సులను కదిలించింది. ఈ నాటికలో శ్రీకారం రోటరీ సభ్యులు ఒంగోలు పోక్సోకోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేస్తున్న గొట్టిపాటి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈశ్వరప్రసాద్, ప్రైవేటు కాలేజీ ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి, రైతు కుటుంబానికి చెందిన చెన్నుపాటి బసవరాములు, మాదాల సాంబశివరావులు తమ పాత్రల పరిధులు మేర చక్కగా నటించారు. అదేవిధంగా రోటరీ కళాపరిషత్ కన్వీనర్ ఎవర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు నాటికను రచించగా, ఎస్ జయరావు దర్శకత్వం వహించారు.



నాటికలోని సన్నివేశం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే మినీ స్టేడియం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని పరిశీలించిన ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున కోట్లు వెచ్చించి ఎన్టీఆర్ మినీ స్టేడియాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. శుక్రవారం పర్చూరులో రూపుదిద్దుకున్న క్రీడా స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ పంషద్దీన్, తంగెళ్ళ మల్లికార్జునరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శివరాం ప్రసాద్, కొల్లా శ్రీనివాసరావు, మానం హరిబాబు, పోపూరి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్, పాల్గొన్నారు. దీనికి ముందు స్థానిక ఎంపీపీ యూపీ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఏలూరి ప్రారంభించారు. అదేవిధంగా రూ.2కోట్ల నిధులతో ముస్లింల ప్రార్థనకోసం ఏర్పాటు చేస్తున్న మసీదు నిర్మాణ పనులను ఏలూరి పరిశీలించారు.



క్రీడాకారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నిరుద్యోగ యువతీ యువకులకు జీవనోపాధిని పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కోరారు. పర్చూరులో ఏర్పాటు చేసిన (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

మాఫియాలే మట్టుబెట్టాయా?

రేషన్, లిక్కర్, ఇసుక వ్యవహారాల్లో విభేదాలు

స్కూటీ క్లూతో ఛేదన దశకు పోలీసు దర్యాప్తు

వీరయ్య హత్యకేసు పోలీసు దర్యాప్తులో పురోగతి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇసుక, లిక్కర్, రేషన్ మాఫియాలే టీడీపీ యువ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరిని హత్యకు కారణమని తెలుస్తోంది. తాజా పోలీసు దర్యాప్తు ఆ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. హంతకులు వినియోగించిన స్కూటీ దొరకటంతో కేసు మిస్టరీ వీడిపోయే దశకు చేరింది. స్కూటీ క్లూతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు శరవేగంగా హత్యకు కుట్రదారులను, పాత్రదారులను గుర్తించే విషయంలో ముందడుగు వేశారు. అప్పటికే అదుపులో ఉన్న అనుమానితులతో పాటు మరికొందరిని శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి అదుపులోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సైతం ఒకరిద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ఒంగోలుకు తరలిస్తున్నారు. కుట్రదారులు, స్థానిక పాత్రదారులపై ఒక అవగాహనకు వచ్చిన పోలీసులు పరారీలో ఉన్న కిరాయి హంతకుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. గత మంగళవారం రాత్రి వీరయ్య హత్యకు గురికాగా సరైన క్లూ దొరకక పోలీసులు సతమతమవుతున్న విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా రాజకీయ, వ్యాపార అంశాలపై దృష్టిసారించారు. తాజా సమాచారం మేరకు రాజకీయ అంశాలే తప్ప వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వారి పాత్ర లేనట్లుగానే పోలీసులు భావిస్తున్నారు.

వీరయ్య హత్యకు గురైన వెంటనే ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలుకు చెందిన రాజకీయ విరోధితో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటిరోజు అదే మండలానికి చెందిన మరో రౌడీషీటర్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి క్లూ దొరకకపోవటంతో వ్యాపార లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చీమకుర్తికి సమీపంలోని బైపాస్ కూడలి వద్ద రక్తపు మరకలు పడి ఉన్న స్కూటీ పోలీసు దర్యాప్తులో కీలకంగా మారింది. దానిని గమనించిన ఒకరు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి వెళ్లారు. స్కూటీని స్వాధీనం చేసుకుని తద్వారా దర్యాప్తును సాగించటంతో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

గ్రామస్థుల పాత్ర గుర్తింపు

వీరయ్య హత్య కేసులో అతని సొంత గ్రామంలో ప్రత్యర్థి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు విచారణ కొనసాగించారు.పోలీసులకు దొరికిన స్కూటీ ప్రత్యర్థికి సుపరిచితుడైన ఒంగోలు అన్నవరప్పాడు ప్రాంతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. ఇతను ఇసుక వ్యాపారం కూడా చేస్తాడని సమాచారం. వెంటనే పోలీసులు గాలింపు చేపట్టగా అతను అజ్ఞాతంలో ఉన్నాడని వెల్లడైంది. మరో వైపు అమ్మనబ్రోలులో ఆది నుంచి వీరయ్యతో శతృత్వం ఉన్న మరికొందరిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మాఫియా పాత్రా తోడైందా?

ఇదేసమయంలో హంతకులకు నాగులుప్పలపాడుమండలంలో రాజకీయ విరోధిగా ఉన్న రేషన్‌మాఫియా చేస్తున్న రౌడీషీటర్ సహకారం కూడా లభించిందన్న అంశంపై పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు. ఇటు గ్రామంలోని విరోధులతో పాటు ఒంగోలు వ్యక్తి వంటి వారి సహకారం తోడుకావటంతో అదే తరహాలో హతుడు వీరయ్యకు రాజకీయ విరోధిగా ఉన్న రేషన్ మాఫియా డాన్ పాత్రను కూడా పరిగణనలోకి తీసుకుని అనేక అంశాలను రాబడుతున్నట్లు సమాచారం. వీరందరికి మధ్య కొద్దిరోజులుగా జరుగుతున్న సంభాషణలను పసిగట్టేందుకు కాల్‌డేటాను కూడా పరిశీలించారు. వారందరి మధ్య వందల ఫోన్‌కాల్స్ నమోదైనట్లు కూడా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

దశాబ్దకాలం నుంచి వైషమ్యాలు

అమ్మనబ్రోలులో ప్రస్తుత అనుమానితులు కుటుంబం, హతుడు వీరయ్యల మధ్య ఆది నుంచి రాజకీయ వైరం ఉంది. అనుమానితుడి తండ్రి కూడా ఆరంభంలో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు వర్గంలోనే ఉండేవారు. పీఏసీఎస్, పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో వీరయ్య పాత్ర గణనీయంగా పెరిగింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య క్రమేపీ వైషమ్యాలు పెరిగాయి.2014 నుంచి వీరయ్య గ్రామంలోనేగాక మండలస్థాయిలో టీడీపీ పెత్తనాన్ని అందిపుచ్చుకున్నారు. ఆ కోవలోనే ఉప్పుగుండూరుకు చెందిన రేషన్ మాఫియా నాయకుడు టీడీపీ నుంచి వెళ్లి వైసీపీలో చేరి గత ప్రభుత్వంలో పెత్తనం చెలాయించారు. గ్రామంలోని వీరయ్య తన వ్యతిరేకులను పక్కన పెట్టారు. రౌడీషీటర్‌గా ఉన్న వైసీపీ నాయకుడు ఇటీవల టీడీపీలో చేరే ప్రయత్నాలు చేయగా వీరయ్య అడ్డుకున్నారు. అలాగే టీడీపీ అధినాయకత్వంతో వీరయ్యకు పూర్తిసంబంధాలు ఏర్పడ్డాయి. పైగా జిల్లా స్థాయి పదవిని చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోందిఈ దశలో వీరయ్యను హతమార్చటం ఇటు రాజకీయ వైషమ్యాలతోపాటు ఆయన ఎదుగుదలపై ఈర్ష్య కూడా కారణమై ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రధాన అనుమానితుడు సతీమణి అమెరికాలో ఉంటుండగా, కొంతకాలంగా తాను కూడా అమెరికా పోతున్నట్లు అతను తన సన్నిహితులకు చెప్పినట్లు పోలీసులు తెలుసుకున్నారు. శుక్రవారం పోలీసులు పరిశీలన చేయగా ఈనెల 29న ఆయన అమెరికా వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు వెల్లడైంది.

గ్రామంలో పోలీసు పికెట్

సమాచారంతో గ్రామంలో వీరయ్య అభిమానులు ప్రత్యర్థులపై తిరగబడవచ్చన్న అనుమానంతో అమ్మనబ్రోలులోను, ఆ మండలంలోను పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి సమీక్ష చేస్తున్నారు.

ఆర్థిక సహకారంపై ఆరా

ప్రాథమిక సమాచారం తేటతెల్లంకావటంతో ఈ హత్యకు సంబంధించి ఆర్థిక సహకారం ఎవరైనా ఇచ్చారా అన్న అంశంపై కూడా పోలీసులు దృష్టిసారించారు. నలుగురిలో ఇద్దరు కిరాయి హంతకులని పోలీసులు బలంగా నమ్ముతున్నారు. రాత్రి 7.40 కల్లా హత్య చేసి 8 గంటలకల్లా మోపెడ్‌పై చీమకుర్తి బైపాస్ వద్దకెళ్లిన వారు వాహనాన్ని అక్కడ వదిలి బస్‌లో ఇతర ప్రాంతానికి వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అందులో ఇద్దరు విజయవాడ నుంచి వెళ్తున్న కనిగిరి బస్ ఎక్కి కనిగిరిలో దిగారని అక్కడి నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లారని నిర్ధారించుకున్నారు. ఆ ఇద్దరిని కిరాయి హంతకులుగా భావించి వారికోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఇటు కిరాయి హంతకులకు, ఇతర అవసరాలకు పెద్దమొత్తంలో డబ్బు వెచ్చించినట్లు గుర్తించిన పోలీసులు ఆర్థిక సహకారం ఎవరు ఇచ్చి ఉంటారన్న అనుమానాలపై మరో దర్యాప్తు చేపట్టారు. అదే మండలానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ఒక సంపన్నుని సహకారం కూడా ఉండి ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు హైదరాబాద్‌లో కూడా దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా వీరయ్యతో ఉన్న వైషమ్యాలను దృష్టిలో ఉంచుకుని ఆ వైపు నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఇదేసమయంలో కొద్దిరోజులుగా అమ్మనబ్రోలు ప్రాంతంలో వీరయ్యకు ప్రమాదం పొంచి ఉందన్న నానుడి కొందరి మధ్య నలిగినట్లుగా పోలీసులు గుర్తించారు. గ్రామానికి సంబంధించిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణ ఆడియోను పోలీసులు రాబట్టుకున్నట్లు కూడా సమాచారం. ఆ కోణంలో అమ్మనబ్రోలుకు చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన రోజు అనుమానితులు ఒంగోలులోనే ఉండటం అందులో ఒకరు పరారీలో ఉండటాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నారు. కిరాయి హంతకులను మాట్లాడటం, ఇతర వ్యవహారాలలో ఒంగోలుకు చెందిన వ్యక్తి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో ఒక పోలీసు బృందం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఆపదకాలంలో సీఎం సహాయనిధి ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే కొండయ్య

అవీఇవీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో సీఎం సహాయ నిధి నుంచి అందిస్తున్న సాయంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు నిరంతరం శ్రమిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం రూ.25,83,320 లక్షల సహాయనిధి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వైద్య సహాయార్థం అందిస్తున్న సాయం, నిరంతరం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు పూర్తి రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హరిబాబు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అధైర్యపడకుండా జీవన మనుగడ సాగించాలంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వన్‌టౌన్ ఎస్సై హరిబాబు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్ అత్యంత అధునాతనంగా ఉందని, సకాలంలో సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శివకుమారి, సిబ్బంది లోకేష్, సుబ్బారావు,సునీత పాల్గొన్నారు.

లారీని ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి



సంఘటనాస్థలం వద్ద పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌పై అద్దంకి నుంచి మైలవరం వెళ్తున్న జమ్మలమడక లింగయ్య(32) ముందు వెళ్తున్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... అద్దంకి మండలం మైలవరానికి చెందిన లింగయ్య శుక్రవారం మధ్యాహ్నం అద్దంకి వచ్చి రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వెళ్తూ శాంతినగర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని గమనించకుండా వెనుక వైపు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు గోతులమయంగా ఉండటం కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. సంఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. భార్యనాగలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలుజారి చెరువులో పడిన బాలుడు

కాపాడిన గొర్రెలకాపరులు.. ఆస్పత్రికి తరలింపు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాల గ్రామంలో చెరువు వద్దకు వెళ్లిన పదేళ్ల బాలుడు కాలు జారి లోపల పడిపోగా స్థానికులు కాపాడారు. తెలిపిన వివరాలకు మేరకు... గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు చెరువు వద్దకు వెళ్లారు. వారిలో భరత్ అనే బాలుడు కాలు జారి చెరువులో పడిపోవడంతో మిగిలిన ఇద్దరు పరుగులు తీశారు. గమనించిన గొర్రెల కాపరులు చెరువులో దూకి బాలుడిని కాపాడారు. ప్రమాదానికి గురైన భరత్‌ను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు, అక్కడ నుంచి గుంటూరు వైద్యశాలకు తీసుకువెళ్లినట్లు సమాచారం.



ప్రమాదానికి గురైన బాలుడు భరత్

పొగాకు రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మేదరమెట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ, వైట్‌బర్లీ, వర్జీనీయా పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కార్యాలయం వద్ద తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ నల్లబర్లీ ఇంత వరకు కొనుగోలు మొదలు పెట్టలేదని, ధరలు కూడా గత సంవత్సరంతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మోండ్రు అంజనేయులు, నాతాని హనుమంతరావు, రవీంద్రబాబు, జయరావు, ప్రసాదరావు, రైతులు కోరారు.

హానికర రసాయనాలతో అనారోగ్య సమస్యలు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలతో పండించిన పండ్ల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, దానిపై ఆహార తనిఖీ అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్‌తో మామిడి ఇతర రకాల పండ్లు పండించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపా రు. తలతిరగడం, తరచూ దాహం, చికాకు, బలహీనత, వాంతులు, చర్మం పై పుండ్లు, ఇతర జీర్ణ కోశ వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇథలిన్ గ్లాస్‌తో, రైపనింగ్ చాంబర్స్‌లో సహజ సిద్ధంగా పండించిన పండ్లు, ఆహార పదార్థాలపై పంచాయతీరాజ్ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి గరికపాటి ప్రభాకర్‌రావు, డీటీసీ సుశీల, అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ


బాధిత మహిళలను విచారిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలోని మేడా వారి వీధిలో గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో బంగారు ఆభరణాలు లాక్కొనివెళ్లాడు. అందిన వివరాల ప్రకారం... ఆ ప్రాంతానికి చెందిన బెల్లంకొండ వెంకటశేషారత్నం మరో ఇద్దరు మహిళలు ఆటోలో ఇంటి సమీపంలో దిగారు. ముగ్గురు నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా ద్విచక్రవాహనంపై హెల్మెట్‌తో వచ్చిన దుండగుడు శేషారత్నం మెడలో సుమారు 13 సవర్ల బంగారు ఆభరణాలు లాక్కుని పరారయ్యాడు. దీంతో బాధిత మహిళ, సహచరులు బిగ్గరగా కేకలు వేయడంతోపాటు పోలీసులకు సమాచారం చేర వేశారు. వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వైసీపీ నేత అరెస్ట్

గతంలోనూ గవిని శ్రీనివాసరావుపై పలు కేసులు

14 రోజులు రిమాండ్ విధించిన న్యాయమూర్తి


గవినిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో చీరాల వైసీపీ నేత గవిని శ్రీనివాసరావును టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ మైనర్‌కు సంబంధించిన విషయంలో గవినివారిపాలెం కు చెందిన పిట్టు నాగరాజుపై పోక్సో కేసు నమోదైంది. అంతేకాకుండా వి చారణలో అతడిని వైసీపీ నేత గవిని శ్రీనివాసరావు ప్రేరేపించినట్లు గుర్తిం చి ఏ4గా కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరావు అనుచరుడు చీదరబోయిన గోపీతో హైదరాబాదు సమీపంలో తలదాచుకుంటున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. గతంలోనే శ్రీనివాసరావుపై పలు కేసులు ఉన్నాయి. అలాగే కేసులో మొదటి నిందితుడు పిట్టు నాగరాజు ఇప్పటికే రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భర్త చనిపోతే భార్య పెన్షన్ దరఖాస్తుకు అవకాశం

యద్దనపూడి/మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెన్షన్ తీసుకుంటున్న భర్త అనివార్య కారణాలు వలన చనిపోయినట్లయితే భార్య ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వివరాలను యద్దనపూడి ఎంపీడీవో టి లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపించిన విధి విధానాలను ఆయన వివరించారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వతేదీలోపు అంటే ఈ మధ్య కాలంలో పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోతే, అతని భార్య ప్రస్తుతం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారాలతోపాటు భర్త ఆధార్ కార్డు, పెన్షన్‌బుక్, భార్య ఆధార్, రేషనుకార్డు, భర్త డెత్ సర్టిఫికెట్ ల జిరాక్స్ కాపీలను జతపరచాలని ఎంపీడీవో తెలిపారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను నిరసిస్తు నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం వరకు వస్త్ర దుకాణాలను మూసివేస్తున్నట్లు చెప్పారు.

బెల్లం అమ్మకాలపై నిబంధనలు పాటించండి

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బెల్లం అమ్మకాలపై దుకాణదారులు నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు చెప్పా రు. శుక్రవారం కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగం గా దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. పలు హెచ్చరికలు జారీ చేశారు.

నేటి నుంచి కళాంజలి నాటకోత్సవాలు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో కళాంజలి నాటకోత్సవాలను శనివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అభిమానులు, పుర ప్రజలు పాల్గొనాలని కోరారు.

రైతులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

రాక్షస పాలనలో వారికి వెలకట్టలేని నష్టం

పొగాకు రైతుల సమస్య పరిష్కారానికి కృషి

రూ.కోటి సబ్సిడీ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఎమ్మెల్యే ఏలూరికి చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు

పర్చూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాక్షస పాలనలో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లిందని దాన్ని సరిచేయటం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. శుక్రవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏలూరి మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమమే రాష్ట్ర పభుత్వ లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అవసమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రపరికరాలను ఇవ్వకుండా మంగళం పలికిందన్నారు. కనీసం పంటల ఆరుతడులకు సక్రమంగా నీరు కూడా అందించిన దాఖలాలు లేవని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆయకట్టు చివరి భూములకు సైతం నీరు అందించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోటి రూపాయల వ్యయంతో రైతాంగానికి వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందించినట్లు తెలిపారు. ఇందులో రూ.69 లక్షల సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో క్రీడా ప్రాంగణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.నాగులపాలెం సమీపంలో నూతన హైవే నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు.

ట్రై సైకిల్స్ పంపిణీ...

పర్చూరు మండలానికి చెందిన పలువురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఏలూరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే వెలుగు సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో సబ్సిడీపై అందించిన కెమెరాలను ఎమ్మెల్యే ఏలూరి చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

తల సేమియా బాధితులకు భరోసా

సాకేత్ ట్రస్టు ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా రూ.10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావుకు అందజేశారు.

ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు


అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, ప్రజలు

రెండు దశాబ్దాలకే మరమ్మతులు

పట్టించుకోకపోతే మరింత శిథిలావస్థకు చేరే అవకాశం

అద్దంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అద్దంకి తహసీల్దార్ కార్యాలయం భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం నిర్మాణం జరిగింది. ఇప్పటికే తహసీల్దార్ గదితో పాటు వరండాలోనూ తరచూ పెచ్చులు ఊడి పడుతున్నాయి. శ్లాబ్‌లో ఇనుప చువ్వలు కూడా బయటకు కనిపిస్తున్నాయి. దీంతో మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే శ్లాబ్ కూలే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు. నిత్యం అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో అర్జీదారులు, రైతులు ఉండే తహసీల్దార్ కార్యాలయం శ్లాబు పెచ్చులు ఊడిపడుతున్నందున ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులైనా చేయాలని పలువురు కోరుతున్నారు.


తహసీల్దార్ గది ముందు వరండాలో ఊడిన శ్లాబ్ పెచ్చు


తహసీల్దార్ గదిలో ఊడిన పైకప్పు పెచ్చులు


అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెంలో పూడిక తీస్తున్న కూలీలు

అద్దంకిలో సైడ్ డ్రెయిన్లు క్లీన్

12 లక్షల రూపాయలతో పూడికతీత పనులు

అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మురుగు కాలువలలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. రెండు మేజర్ డ్రెయిన్లతో పాటు పట్టణం పరిధిలో ఉన్న అన్ని సీసీ డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టారు. 12 లక్షల రూపాయల నిధులు కేటాయించి ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి పూడికతీత పనులు చేస్తున్నారు. దీంతో సైడ్ డ్రెయిన్ లలో పూడికతీతకు అడ్డంకులు తొలిగి మురుగు సాఫీగా ముందుకు సాగనుంది. మురుగు వాసన సమస్య కూడా తగ్గనుంది.

వేసవిలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ సిద్ధార్థ

పర్చూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ చెప్పారు. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వడదెబ్బ బారి నపడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేశారు. డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ తీవ్ర ఉష్ణోగ్రతలుండే సమయంలో బయట తిరగకూడదన్నారు. మాంసాహారాన్ని తగ్గించి వాటి స్థానంలో తాజా ఆకుకూరలను తీసుకోవాలని చెప్పారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లను మాత్రమే సేవించాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలని, చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో సాధారణ ఉష్ణోగ్రత వచ్చేవరకు తుడవాలని సూచించారు. ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం కానీ తాగించాలన్నారు. వేసవిలో రోజుకు 15 గ్లాసులకు తగ్గకుండా నీటిని తీసుకుంటే వేసవి బారి నుంచి రక్షించుకోవచ్చని చెప్పారు.

మలేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి


అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారించేందుకు ప్రజలు కృషి చేయాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఏరియా హాస్పిటల్ పీపీ యూనిట్ వైద్యాధికారులు యాకోబు, వీరబ్రహ్మం చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతా శేషుబాబు, రవికుమార్, వసంతవల్లి, బేబమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే అంటూ ర్యాలీ

యద్దనపూడి/మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా అంతం మనతోనే అంటూ శుక్రవారం యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని డాక్టరు శ్రీహర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ తంగెళ్ల విజయచంద్ర మాట్లాడుతూ అందరిలో మార్పు వస్తేనే మలేరియా అంతం అవుతుందని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే జరపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజరు సునంద పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

పంగులూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమల నివారణతో వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారిణి బాలరాజేశ్వరి చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంగులూరులో వైద్యాధికారులు, సిబ్బంది మలేరియా పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, సీహెచ్‌వో భారతి, ఎల్‌టీ చందన, ఫార్మసిస్ట్ పద్మావతి, స్టాఫ్‌నర్స్ క్రాంతి, రాజారెడ్డి, రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు రామాంజమ్మ, మంగమ్మ, మాణిక్యం, లలిత, జయమ్మ, శకుంతల, ఎస్తేరు, శ్రావణి, రేణుక కోటేశ్వరి పాల్గొన్నారు.

మలేరియ రహిత సమాజం మన అందరి బాధ్యత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత సమాజం మన అందరి బాధ్యత అని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మోదేపల్లి పిహెచ్‌సి, పట్టణంలోని గాజులపాలెం, కాకానిపాలెం ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కీటక జనీత వ్యాధులపై, దోమల వలన వచ్చే మలేరియా, డెంగ్యూ, బోధకాలు, మెదడువాపు, చికెన్ గున్యా విధుల గురించి పట్టణంలోని ప్రధాన దారులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి చుట్టు మురుగునీరు, వాడని రోళ్లు, కూలర్లు, నీటి తొట్లు, పడవేసిన కొబ్బరి బోండాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోన్నారు. దోమతెరలు, వాడాలని, సాయంత్రం 6 తరువాత కిటికీలు, తలుపులు మూసివేయడం, వేప ఆ కు పొగ వేయడం, నీటి నిల్వలలో ఆ యిల్ బాల్స్ వేయడం ద్వారా దోమకాటును నివారించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ జయసింహా, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ బాలరాజు, డాక్టర్ మాధురి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆ శా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



చినగంజాంలో నిరసన ప్రదర్శన చేస్తున్న జన సేన నేతలు

చినగంజాం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడం హేయమైన చర్య అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ చెప్పారు. జనసేన పార్టీ అధినేత కే పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు ఉలిచి ఏసుబాబు, శిఖరం కోటయ్య, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, నాయకులు టి.ఆదినారాయణ, బొప్పన సాయి, గంటాలక్ష్మీనారాయణ, పెదసింగు వెంకటేష్, గంటా వెంకటేష్, నాగుర్, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల కిరాతక చర్యలకు పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ శుక్రవారం రాత్రి మార్టూరు సెంటర్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సకల ఆంజనేయులు, ముప్పవరపు హనుమంతరావు, పసుపులేటి నాగరాజు, పానుగంటి హనుమంతరావు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అవీఇవీ


చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బ్యాంకులలో ఖాతాలు కలిగిన వినియోగదారులకు అందిస్తున్న పలు రకాల భీమా పథకాలను సద్వినియెగం చేసుకోవాలని బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె. శీనానాయక్ చెప్పారు. ఇటీవల చెన్నుపల్లికి చెందిన పాలపర్తి ఏసురత్నం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి ఏపీజీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన్‌లో సభ్యత్వం ఉంది. ఏసురత్నం మృతి చెందటంతో బీమా ద్వారా రూ. 2 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం మేనేజర్ శీనానాయక్ మృతుడు భార్య అంజమ్మకు నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సీహెచ్ రవీంద్రబాబు, సుహితా గ్రేస్, బిందు మాధవి పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా కట్టుదిట్టంగా శాంతిభద్రతలు



మాట్లాడుతున్న ఎస్సై వై నాగరాజు

బల్లికురవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా డ్రోన్ నిఘా ద్వారా కట్టుదిట్టంగా శాంతిభద్రతలను అదుపులోకి తీసుకొస్తున్నామని ఎస్సై వై నాగరాజు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యక్తిగత విషయాలను కూడా రాజకీయపార్టీలు తమకు అనుకూలమైన పద్ధతిలో పెద్దవి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

27 మందిపై బైండోవర్ కేసులు

మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో వైసీపీ, టీడీపీలకు చెందిన 27 మందిపై తహసీల్దారు రవినాయక్ సమక్షంలో శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు.

దాతల సహకారంతో కూలింగ్ వాటర్ చలివేంద్రాలు



భవానీ సెంటర్‌లో వేయిస్తంభాల గుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రం

అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలువురు దాతలు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ఇప్పటికే అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 9 ప్రాంతాలలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అదే సమయంలో మరికొందరు దాతలు ముందుకు వచ్చి కూలింగ్ వాటర్ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో రాచమల్లు శివాంజనేయులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి కూలింగ్ మినరల్ వాటర్ బబుల్స్ ఉంచుతున్నారు. భవానీ సెంటర్‌లోని వేయిస్తంభాల గుడి ఆధ్వర్యంలో దేవాలయం ముందు కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. అత్యధిక శాతం వ్యాపారులు తమ షాపుల వద్ద కూలింగ్ వాటర్ బబుల్స్ ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి కలెక్టర్ అభినందన


విద్యార్థిని హర్షిణిని అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి అద్దంకిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిణిని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. మేడిశెట్టి వెంకటసాయిశ్రీహర్షిణి పదో తరగతి పరీక్షలలో 593 మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి స్థానం, బాపట్ల జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. హర్షిణిని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అభినందించి సత్కరించారు.

పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతూ ఎంపీడీవో కె.స్వరూపారాణి

పంగులూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామంలో పండ్లతోటల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పండ్లతోటల పెంపకం ప్రోత్సహించాలని కోరుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు.ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ మామిడి, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, పెద్దరేగిపళ్ల మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు అందజేస్తామని చెప్పారు. మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చు రాయితీగా ఇస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఉపాధిహామీ పథకం అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ ఏవో దీప్తి, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఏపీవో సంతోషం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ. ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వైసీపీకి రాజీనామా


కోట శ్రీనివాసకుమార్

అద్దంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్, ఆర్యవైశ్యానాయకుడు కోట శ్రీనివాసకుమార్ శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలకంగా వ్యవహరించిన కోట శ్రీనివాసకుమార్ శింగరకొండ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. ఆడిటర్‌గా మంచి గుర్తింపు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో తన రాజీనామా లేఖను శుక్రవారం జిల్లా అధ్యక్షుడు నాగార్జునకు పంపినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అతను త్వరలో ఏదో ఒక పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కోట రాజీనామాతో అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గంలో వైసీపీకి షాక్ తగిలినట్టే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.